ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు


జిల్లా వార్తలు

బుధవారం 7 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	39.6	27.8
కావలి	36	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	27
కందుకూరు	38	28





సీసీ కెమెరాకు చిక్కిన పెద్దపులి

నిఘా నేత్రానికి

దొరికాయ్!

మూడు పులులు, 60కిపైగా చిరుతల పరుగులు

ఎలుగుబంట్లు, నక్కలు, ముళ్లపందులు

సర్వేలో వెలుగులోకి వచ్చిన ఎన్నో రకాల వన్యప్రాణులు

టైగర్ కారిడార్‌తో అధికారులు అప్రమత్తం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెద్దపులుల గాండ్రింపులు పెరిగినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. నాలుగేళ్లకోసారి జరిగే టైగర్ సర్వేలో పెద్దపులులతోపాటు చిరుతలు, ఎలుగుబంట్లు ఇలా ఎన్నో రకాల జంతువులు, వన్యప్రాణులను గుర్తించారు. రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్‌ల పరిధిలోని సుమారు లక్ష హెక్టార్ల అటవీ ప్రాంతంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం శేషాచలం టైగర్ కారిడార్‌గా గుర్తించింది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన టైగర్ సర్వేలో పెద్దపులుల కదలికలు వేగంగా పెరిగినట్లు అటవీ శాఖఅధికారులు గుర్తించారు. ఈ మూడు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతంలో దాదాపు 250 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు 45 రోజులపాటు కెమెరాలతో నిఘా పెట్టి సర్వే చేశారు. ఈ సర్వేలో పెద్దపులులతోపాటు చిరుతల కదలికలూ పెరిగినట్లు గుర్తించారు. అలాగే ఎలుగుబంట్లు, రేసుకుక్కలు, నక్కలు, జింకలు, కణితలు, ముళ్లపందులు, అడవి పందులు, కుందేళ్లు, కోతులు, అడవి పిల్లులు, కొండ ముచ్చుల సంఖ్య విపరీతంగా పెరిగినట్లు గుర్తించారు.

● టైగర్ కారిడార్‌తో మరింత రక్షణ

జిల్లాలో టైగర్ కారిడార్ ఏర్పాటు కావడంతో వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ మరింత దృష్టి సారించనున్నది. కారిడార్ ఏర్పాటుతో అటవీ ప్రాంతంలో అనేక చోట్ల నీటి వసతులు పెంచాల్సి ఉంది. అటవీ ప్రాంతం మీదుగా వెళ్లే రహదారుల వెంబడి పులులు ఉన్నట్లు బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. అలాగే చెట్లను నరకకుండా చర్యలు తీసుకోవడంతోపాటు అటవీ విస్తీర్ణం పెంచాల్సి ఉంటుంది. అదేవిధంగా సమీప గ్రామాల్లోని ప్రజలకు టైగర్ కారిడార్, వాటి సంరక్షణ గురించి అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ఇప్పటికే మూడు రేంజ్‌ల పరిధిలోని సూమారు లక్ష హెక్టార్లలో శేషాచలం టైగర్ కారిడార్‌లో కలిపాము. ఈ ప్రాంతాల్లో పెద్దపులుల కదలికలు ఉన్నాయి. రోజుకు వందల కి.మీ దూరం తిరుగుతూ ఉంటాయి. వాటికి అవసరమైన ఆహారం సమృద్ధిగా ఉన్నప్పుడే పులి కారిడార్ ప్రాంతంలో నిలుస్తుంది. ఇక పులులతోపాటు చిరుతలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల వాటికి కావాల్సిన నీటి వసతులు, పొదల్లాంటి చెట్లను పెంచడం ఇలా అనేక ప్రత్యేక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాము.

- మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో





గుర్తించిన జంతువులు, వన్యప్రాణులు	
పులులు	మూడు
చిరుతలు	60
ఎలుగుబంట్లు	140
రేసుకుక్కలు	250
రుడ్డ ముంగిసలు	20
నక్కలు	100

ఇదిగో మరో హత్య!

- వేదాయపాలెం స్టేషన్ పరిధిలో ఘాతుకం
- అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన అగంతకులు
- నిద్రపోతున్న రియల్టర్ ముఖంపై నరికి హత్య
- మృతుడికి స్వగ్రామంలో వివాదాలు, కేసులు
- పలు కోణాల్లో విచారిస్తున్న పోలీసులు
- వరుస ఘటనలతో భీతిల్లుతున్న నగరవాసులు

8లో..



సోఫాపై చిన్నయ్య మృతదేహం

వరుస హత్యలతో నగరం అట్టుడుకుతోంది. రోజుల వ్యవధిలోనే నగరంలో ఏదో ఒకమూల అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారు. ఈ నెలలో ఆరు రోజుల వ్యవధిలో మంగళవారం రెండో హత్య వెలుగు చూసింది. వెంకటరెడ్డినగర్‌లో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి జొరబడిన అగంతకులు ఓ వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా నరికి చంపారు. ఆ తర్వాత ఎంచక్కా పరారయ్యారు. అయితే, మృతుడికి ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలు తదితర అంశాలపై ప్రత్యర్థులతో విభేదాలు ఉన్నాయి. ఈ కారణాలతోనే ఎవరైనా సుపారీ ఇచ్చి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారా!? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజుల వ్యవధిలో హత్యలు జరుగుతుండటంతో నగరవాసుల్లో భయాందోళన నెలకొంది. ఇటీవల జరిగిన జంట హత్యలపై రాష్ట్ర పోలీస్‌బాస్ జిల్లా పోలీస్ యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మేల్కొన్న పోలీసులు కొన్ని రోజులపాటు తనిఖీల పేరుతో హడావుడి చేసి ఆ తర్వాత చేతులెత్తేశారు.



ఇష్టానుసారం

వాడేస్తున్నారు!

- అవసరానికి మించి ఎరువులు, పురుగు మందుల పిచికారీ
- రైతులకు పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులు
- మనుషులు, పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

నెల్లూరు (వ్యవసాయం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ఎంత ఎక్కువగా ఎరువులు వినియోగిస్తే పంట దిగుబడులు అంత బాగుంటాయి. పురుగు మందులు ఎంత ఎక్కువ వాడితే పంటలకు పురుగుల తాకిడి అంతగా తగ్గుతాయి.. ఎరువులు, పురుగుల మందుల వాడకంపై రైతుల నుంచి సాధారణంగా వినిపించే అభిప్రాయాలు. ఈక్రమంలో అన్నదాతలు ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. అయితే మోతాదుకు మించి ఎరువుల వాడకం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండకపోగా మట్టి చౌడుగా మారే ప్రమాదం ఉందన్న విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.



● అవసరం లేకపోయినా...

ఎరువుల వినియోగం ప్రతి సంవత్సరం పెరిగిపోతోంది. దీనికి వ్యవసాయ శాఖ వద్ద ఉన్న లెక్కలే నిదర్శనం. ఎకరా పొలంలో 70కేజీల యూరియా, 50 కేజీల డీఏపీ, 27 కేజీల పొటాష్ ఎరువులు వినియోగం సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సిఫారసు చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులను కేవలం దుక్కిలో మాత్రమే వాడాలి. అయితే క్షేత్రస్థాయిలో అంతకుమించి ఎరువుల వినియోగం జరుగుతోంది. కాంప్లెక్సు ఎరువులు పంటల సాగులోనూ వినియోగిస్తున్నారు. రైతులకు ఏవైనా సందేహాలు వస్తే నేరుగా వ్యాపారులను ఆశ్రయించడం కూడా అధిక ఎరువుల వినియోగానికి ఒక కారణంగా కనిపిస్తోంది. పైరుకు చీడపీడలు సోకకుండా ముందస్తుగా ఈ మందు స్ప్రే చేయండంటూ వ్యాపా రులు సలహాలు ఇస్తుంటారు. దీంతో అవసరం లేకపోయినా పైరు పాడవుతుందన్న ఆందోళనతో రైతులు కొనుగోలు చేసి వాడేస్తు న్నారు. అదీనూగాక రైతుల వద్ద పెట్టుబడులు లేకపోవడం, అవసరమైన సమయంలో ఎరువులు, పురుగు మందులు వ్యాపారులు అప్పులకు ఇవ్వడంతో వారి సలహాలను తీసుకునే పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు, రైతులు చెబుతున్నారు.

ఐదేళ్లలో ఎరువుల వినియోగం ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో)

సంవత్సరం	యూరియా	డీఏపీ	ఎంఓపీ	కాంప్లెక్సు	ఎస్‌ఎస్‌పీ
2020-21	155805	26306	108550	28355	14255
2021-22	131011	11104	83574	20617	12628
2022-23	112911	80232	83946	26505	14286
2023-24	133276	80673	87902	24135	12320
2024-25	112460	21454	22382	74002	13132

● పెరిగిన వ్యవసాయ ఖర్చులు

పంటల సాగులో రైతులు అవలంభిస్తున్న పద్ధతుల్లో కొన్ని మార్పులు వచ్చాయే తప్ప అధిక శాతం మంది ఒకే పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఎరువుల వినియోగంపై ఐదేళ్లుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న సిఫారసుల్లో పెద్దగా మార్పు లేవీ లేవు. గతంలో ఎకరా పొలంలో వరి సాగుకు దాదాపు రూ.16 వేల నుంచి 20వేల వరకు ఖర్చయ్యేది. ఇందులో సగం ఎరువులు, వాటిని పిచికారీ చేసే కూలీల ఖర్చే. ఇప్పుడు రూ.25వేల నుంచి 30వేల వరకు ఖర్చవుతోంది. ఇందులోనూ ఎరువులకే అధిక మొత్తం ఖర్చవుతోంది. బస్తాలకు బస్తాలు ఎరువుల వినియోగించడమే కారణం. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల తెగుళ్ల నాశనమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పైగా కొత్త కొత్త తెగుళ్ల పుట్టుకొస్తున్నాయి. దీంతో ప్రతి ఏడాది అంతకు మించి ఎక్కువ శక్తి కలిగిన ఖరీదైన మందుల వాడకం అవసరమవుతోంది. దీంతో అన్నదాతలకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

భూసార పరీక్షలకు అనుగుణంగానే..



ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందుల పిచికారీతో రైతుకు అదనపు ఖర్చులు పెరుగడమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. వాటి ఫలితాల ఆధారంగానే ఎరువులను వినియోగించాలి. అదేవిధంగా పంటల సాగులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల చీడపీడల ఉధృతి పెరుగుతుంది.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

అనారోగ్య సమస్యలు తప్పవు



పంటల సాగులో మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల పిచికారీ జరుగుతోంది. కూరగాయలు ఇతరత్రా వాటిలో క్రిమి సంహారక మందుల అవశేషాలు ఎంతో కొంత ఉంటున్నట్లు పలు నివేదికలు కూడా చెబుతున్నాయి. వీటి వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.. అధికంగా గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తున్నాయి. అలర్జీలు, కళ్లలో మంటలు, తల తిరగడం, కొన్ని రకాల కేన్సర్లు మహిళల్లో ముఖ్యంగా హార్మోన్ల స్థాయిల్లో అసమతుల్యత ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోతోంది.

- డాక్టర్ బి.కృష్ణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి పథకాల నిర్వహణపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంగళవారం ఆమె చాంబర్‌లో సమీక్ష జరిపారు. ఎక్కడైనా మోటర్లు, పైప్ లైన్లు మరమ్మతులకు గురైతే వెంటనే బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతు పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే తెప్పించుకుని నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకట రమణ, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

అన్నీ సక్రమమేనా!?

- అక్రమ లేఅవుట్లపై సర్వే ప్రారంభం
- 17 మంది.. 17 మండలాల్లో ఆరా

నెల్లూరు (జడ్పీ), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ లే అవుట్లపై రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే ప్రారంభించారు. అక్రమ లేవుట్ల క్రమబద్ధీకరణకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న దానిపై మోడల్‌గా జిల్లాలో సర్వేకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర టౌన్ ప్లానింగ్ విభాగంలోని 17 మంది అధికారులను నియమించి, నగరం, మున్సిపాలిటీలతోపాటు మండలాల్లో సర్వే చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాకు వచ్చిన అధికారులు మంగళవారం సర్వేకు శ్రీకారం చుట్టారు. 17 మంది అధికారులు 17 మండలాల్లో తొలిగా స్థానిక అధికారులతో కలిసి సర్వే చేస్తున్నారు. అక్రమ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి, వాటి పరిస్థితి ఏమిటి? ఇళ్లు నిర్మించారా!? లేదా!? ప్రభుత్వ భూములు ఆక్రమించారా!? క్రమబద్ధీకరణ ఎలా చేయవచ్చు? అదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. అలాగే నుడా నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్ల ఉన్నాయా!? లేదా అనికూడా పరిశీలిస్తున్నారు.

అంకురార్పణతో

ఆరంభం

అట్టహాసంగా వేదగిరి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. మంగళవారం అంకురార్పణ ఘట్టాన్ని అర్చక బృందం నిర్వహించింది. ముందుగా కంకణాలు, దీక్షా వస్త్రాలను లాంచనప్రాయంగా స్వీకరించారు. అనంతరం మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం జరిగాయి. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో వేమూరి గోపి, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, వేదగిరి మాజీ ఛైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



మృత్సంగ్రహణం కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉదయగిరిలో ఉచిత ఖత్నాలు

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం రహమతుల్ ఆలమీన్ ట్రస్ట్, చిన్నమసీదు కమిటీ ఆధ్వర్యంలో వందమంది చిన్నారులకు ఉచిత ఖత్నాలు(ఒడుగులు) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జేవీవీ నాయకుడు షేక్ దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ వైద్యశాలల్లో ఎక్కడా ఖత్నాలు చేయరని, దీంతో దూరప్రాంతాలకు వెళ్లి ఖత్నాలు చేయించుకోవాల్సి ఉండేదన్నారు. కమిటీల ఆధ్వర్యంలో ఇక్కడే ఖత్నాలు చేయడంతో పలువురికి ఉపయోకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9347
వెండి కిలో ధర	రూ. 98,600
వెండి ఒక గ్రాము	రూ.101.60

ప్రత్యేక ఆధార్ శిబిరం పరిశీలన

సంగం, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీవో షాలెట్ మంగళవారం పరిశీలించారు. 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు, అలాగే 6 నుంచి 18 సంవత్సరాలలోపు వారికి ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఆమె పరిశీలించి సూచనలిచ్చారు. వచ్చిన వారు వేచి ఉండకుండా అంగన్‌వాడీ కేంద్రాల వారీగా పిల్లల జాబితా తీసుకుని వారికి సమయం కేటాయించి వచ్చిన వెంటనే ఆధార్ తీసి పంపించాలని ఆదేశించారు.

ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించాలి

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య విషయాలపై వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాత సీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులను నమోదు చేసి, వారికి పోష్టికాహారం అందచేసి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నెలవారి నివేదికలను పరిశీలించారు. వివిధ యాప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు మహాలక్ష్మి, విజయకుమారి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయసులో వివాహం చేసుకుంటే కలిగే అనర్థాలను వారు వివరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు నాగరాజు

దుత్తలూరు(ఉదయగిరి), మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ ఎస్టీ కాలనీలో మంగళవారం తహసీల్దారు వై.నాగరాజు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కాలనీ వాసులు, ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కరెంటు పోతే సాగని పనులు

● ఇన్వర్టర్లు ఉన్నా లేనట్లే.. ● అవస్థలు పడుతున్న కార్యాలయ ఉద్యోగులు, ప్రజలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 6 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే తహసీల్దారు కార్యాలయ పరిస్థితి అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది. విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో ఆ కార్యాలయంలో ఎలాంటి పనులు ముందుకు సాగవు. పనుల కోసం వచ్చిన ప్రజలు విద్యుత్ ఎప్పుడు వస్తుందా ? అంటూ గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగేలా ఏర్పాటు చేసిన ఇన్వర్టర్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోకపోవడం దారుణం. ఈ నేపథ్యంలో ఉద్యోగులు సైతం ఉక్కపోతను తట్టుకోలేక విసుగెత్తిపోతున్నారు. నెలల తరబడి దుమ్ము, ధూళితో నిండిన విలువైన సామగ్రి తుప్పు పట్టి పాడవుతున్నా, అటువైపు కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారనే విమర్శలు



మరమ్మతులకు గురైన ఇన్వర్టర్లు

వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇన్వర్టర్లను వినియోగంలోకి తీసుకురావాలి.

ఆర్టీసీ కార్మికుల నిరసన

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఆ సంఘ సీనియర్ నాయకులు సయ్యద్ మౌలాలీ మాట్లాడుతూ ఆర్టీసీలో కొన్నేళ్లుగా ఉద్యోగులకు పదోన్నతులు నిలిచిపోయాయన్నారు. స్థానిక వైద్యులు ఇచ్చే మెడికల్ సర్టిఫికెట్‌ను అధికారులు పరిగణలోకి తీసుకోకుండా వేతనాలు నిలిపివేయడం దారుణమన్నారు. మహిళలకు ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని, 01/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీటీ షా



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ కార్మికులు

జియాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకులు నాగరాజు, రవి, ఫణికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

సంగం, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆశాడేను పురస్కరించుకుని మాట్లాడుతూ వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అవగాహన లోపంతో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, కావున తగిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం ఆశా కార్యకర్తలకు



సమదుస్తులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

సమదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో ప్రపంచ ఆస్తమా దినోత్సవం

వింజమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డాక్టర్ మాశిలామణి వైద్యశాలలో మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల వైద్యాధికారి కే. మాశిలామణి మాట్లాడుతూ ఆస్తమా శిశువుల దగ్గర నుంచి ముసలివాళ్ల వరకు రావచ్చని, ఇది దీర్ఘకాలిక వ్యాధి అని తెలిపారు. ఊపిరితిత్తులలోని గాలి గొట్టాల్లోకి దుమ్ముధూళిలోకి వెళ్లినప్పుడు దగ్గు రావడం, మామూలుగా అయితే ఆస్మా వచ్చే స్వభావం గలవారికి ఇలాంటి చిన్న విషయాలే నేడు సమస్యగా ఉంటాయన్నారు. ఉబ్బసం అంత ప్రమాదకరమైందని కాదని ప్రస్తుతం సమర్థవంతమైన చికిత్సలు ఉన్నాయని పేర్కొన్నారు. రోజువారి పనులు చేసుకుంటూనే ఉబ్బసానికి సంబంధించిన జాగ్రత్తలు పాటిస్తూ జీవించవచ్చన్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభంగా ఉంటుందన్నారు. చిన్నారుల తల్లిదం



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

డ్రులు వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, హెప్సిబా, మల్లికార్జున, కీర్తన, సుజిత్, దీన, ప్రేమలీల, తిరుమలేశు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నయ్య హత్యతో ఉలిక్కిపడ్డ ఉదయగిరి

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాబాదు ఎస్సీ కాలనీకి చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్న మంగళవారం నెల్లూరులో హత్యకు గురయ్యాడు. దీంతో ఉదయగిరి ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఏ నలుగురు కలిసినా అతని హత్యపై చర్చించుకోవడం కనిపించింది. చిన్నయ్య పలువురికి సుపరిచితుడు. సీతారామపురం మండలం బసినేనిపల్లి పశు వైద్యశాలలో కాంట్రాక్టు పద్ధతిన అటెండర్‌గా పనిచేస్తున్నాడు. నెల్లూరులో కాపురం ఉంటున్న అతను కొన్ని నెలల క్రితం ఉదయగిరికి మకాం మార్చాడు. ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలు, ఇతరత్రా కారణాల వల్ల చిన్నయ్య హత్యకు గురై ఉంటాడని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో భూ వివాదాలకు సంబంధించి చిన్నయ్యపై కేసులు కూడా ఉన్నాయి. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు చిన్నయ్య స్వగ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ఎమ్మెల్యే కాకర్ల దృష్టికి శంఖవరం డీలర్ సమస్య



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో గ్రామస్థులు

వింజమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంఖవరం రేషన్ డీలర్ ఇటీవల మృతి చెందారు. ఆయన మృతి చెందే సమయానికి 750 కేజీల బియ్యం రేషన్ దుకాణంలో తక్కువగా ఉన్నాయి. అందువల్ల గ్రామస్థులకు రేషన్ సరిగా అందలేదు. దీంతో గ్రామస్థులు తరచూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టీకి చెడ్డపేరు వస్తుందని, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, శంఖవరం గ్రామ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు విషయాన్ని తెలియపరిచి, పొదుపు గ్రూపు లీడర్ల ద్వారా అందరికీ రేషన్ అందేలాగా చూడాలని కోరారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కలువాయిలో లేఅవుట్ల సర్వే



రెవెన్యూ సిబ్బందిని లేఅవుట్ల వివరాలు అడుగుతున్న సర్వే అధికారులు

కలువాయి, మే 6(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం జిల్లావ్యాప్తంగా చేపట్టిన సర్వేలో భాగంగా మంగళవారం కలువాయిలోని లేఅవుట్లపై కూడా అధికారులు సర్వే ప్రారంభించారు. సర్వే కోసం నియమించిన బృందం ముందుగా పంచాయతీ, రెవెన్యూ అధికారులను కలసి కలువాయిలో ఎక్కడెక్కడ ఎన్ని లేఅవుట్లు ఉన్నాయి? వాటికి సంబంధించిన వివరాలను అందించాలని కోరారు. అనంతరం సర్వే అధికారులు మాట్లాడుతూ నుడా సీపీవో హిమబిందు ఆదేశాల మేరకు తాము ఇక్కడ ఉన్న అన్నీ లేఅవుట్లపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అథరైజ్డ్ లేఅవుట్లతోపాటు అనుమతి లేని లేఅవుట్లు కూడా పరిశీలిస్తామని చెప్పారు. లేఅవుట్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్లు, డ్రైన్లు, తదితర మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. లేదా అని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వారు తెలిపారు.

80 శాతం హాజరు ఉంటేనే కుట్టు మిషన్లు



మహిళలకు సూచనలిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): కుట్టుశిక్షణ తీసుకునే మహిళలకు 80శాతం హాజరు ఉంటేనే ప్రభుత్వం కుట్టుమిషన్ అందచేస్తుందని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుట్టులో ప్రతిభ కనపర్చి ఆర్థికంగా నిలబడాలన్నారు. 90 రోజుల శిక్షణ అనంతరం ప్రతిఒక్కరికీ ప్రభుత్వం కుట్టు మిషన్ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు సీహెచ్. బయ్యన్న, బొజ్జా నరసింహులు, నిర్వాహకురాలు నాజియాతాజున్, శిక్షకురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఉత్తమ సేవలు అందించండి

ఏఎస్ పేట,మే6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత్ అభియాన్ ద్వారా పీహెచ్‌సీలో గర్భిణులకు ఉత్తమ సేవలు అందించాలని ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ ఖాదర్‌వలి తెలిపారు.మంగళవారం ఆయన చిరమన పీహెచ్‌సీని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు అన్నీ రకాల పరీక్షలు చేయించాలని,ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలోనే కాన్పులు జరిగేటట్లు చూడాలన్నారు. అనంతరం పలు రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

జొన్నవాడలో భారీ చోరీ

● 22సవర్ల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, అర కేజీ వెండి అపహరణ
● వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీం



చెల్లాచెదురుగా పడేసిన బంగారు ఆభరణాల బాక్సులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలోని స్థానిక నీళ్ల ట్యాంకు సమీపంలోని వల్లం సుప్రజ అనే మహిళ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కుటుంబసభ్యులందరూ బయట పంచలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 22సవర్ల బంగారు నగలు, అరకేజీ వెండి వస్తువులు, రూ.లక్ష నగదు తీసుకెళ్లారు. చోరీ అనంతరం ఇంటి తలుపులు ముందుకేసి తాళం తలుపులకే పెట్టివెళ్లారు. ఈ విషయం ఇంట్లోని వారు ఉదయం నిద్రలేచి తలుపులు తీసి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బీరువా లో బట్టలు, బంగారు ఆభరణాలు పెట్టుకునే బాక్సులు ఇంట్లో, మంచం పైన చెల్లాచెదురుగా పడేసి వుండటాన్ని గమనించి బీరువాలో చూసి ఖంగుతిన్నారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి సిబ్బందితో చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్‌టీంతో బీరువా, తలుపులు, పలు చోట్ల వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రతిరోజూ బాధిత మహిళ సుప్రజ ఆమె కొడుకు పెంచలభార్గవ్‌తో పంచలో మంచం వేసుకుని నిద్రిస్తారు. తల దిండు కింద తాళం పెట్టుకుంటారు. వేకువజామున 5గంటలకే నిద్రలేచే కొడుకు.. 6లోపులేచే తల్లీ మంగళవారం ఉదయం 8 గంటలైనా నిద్ర మత్తు వదల్లేదు. ఆ తరువాత లేచి చూసేసరికి ఇంటి తాళం తీసి ఉన్నందున ఆ ఇద్దరిలో ఎవరో ఒకరు తీసివుంటారనే ఆలోచనతో ఉన్నారు. బంగారు, నగదు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో గుండెలు బాదుకుని విలపించారు. రూ.15లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ అవడంతో ఆ కుటుంబం వీధిన పడినట్లైంది.

ఎలుకల మందు తిని గిరిజనుడి మృతి

● నేత్రదానం చేసిన కుటుంబసభ్యులు

మనుబోలు, మే 6 (ఆంధ్ర జ్యోతి): ఎలుకల మందు తి ని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఈ ఘటన మం డలంలోని కొలనుకుదురు గిరిజన కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఈగ చినరాయుడు (25) నె ల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం వేకువజామున మృతిచెందాడు. ఈయనకు భార్య, రెండునెలల పాప ఉన్నది. కుటుంబంలో కొద్ది రోజులుగా చిన్నపాటి తగాదాలు ఉండటంతో మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు.

నేత్రదానం..

నేత్రదానం చేయడం చాలా గొప్పదని చినరాయుడు కుటుంబసభ్యులకు గ్రామ టీడీపీ నాయకులు కసిరెడ్డి సునీల్‌రెడ్డి సూచించడంతో చినరాయుడు నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల ఐ బ్యాంకు టెక్నీషియన్ సునీల్ వచ్చి నేత్రాలను సేకరించారు. అనంతరం చిన్నరాయుడు కుటుంబసభ్యులకు ఐబ్యాంకు తరఫున ధ్రువీకరణపత్రం అందజేశారు. శవపరీక్షల అనంతరం చినరాయుడు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మీ హెచ్చరిక.. మాకో లెక్కా?


● యథేచ్ఛగా కలప నరికి అక్రమంగా తరలింపు



అక్రమంగా నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

దుత్తలూరు (ఉదయగిరి), మే 6 (ఆంధ్ర జ్యోతి): అధికారుల హెచ్చరిక.. మాకో లెక్కా... ? అంటూ అక్రమార్కు లు బరి తెగిస్తున్నారు. యథే చ్ఛగా ప్రభుత్వ భూముల్లో కలప తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల మేరకు.. మండ లంలోని భైరవరం పంచాయ తీలో ఆరెకరాల ప్రభుత్వ భూ మిలో కొందరు అక్రమంగా కలప నరికి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని సోమవారం గ్రామస్థులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆర్ఐ, వీఆర్వో సంఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకు న్నారు. ప్రభుత్వ భూమిలో కలప నరికి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే అక్రమార్జనకు అలవాటుపడ్డ అక్రమారులు వారి హెచ్చరికలను భేఖాతరు చేస్తూ మంగళవారం కూడా యథే చ్ఛగా కలప నరికి వాహనాల్లో తరలించారు. అయితే అక్రమంగా కలప నరికివేతలో అధికారులు అక్రమార్కులకే వంతపాడుతున్నార ని, వారి అక్రమార్జనలో వారికి వాటాలున్నాయని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు నాగరాజును వివరణ కోరగా కలప నరికివేస్తున్నారని మంగళవారం సైతం తన దృష్టికి రావడంతో సిబ్బంది పంపి అక్రమార్కులను గట్టిగా హెచ్చరించామ న్నారు. సిబ్బందిని అక్కడే కాపలాగా ఉంచామన్నారు. మరోసారి ఇలానే చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

బైక్ నుంచి పడి ఒకరికి గాయాలు



బైక్ నుంచి కిందపడి గాయపడ్డ కల్లూరి పెద్ద వెంకట సుబ్బారెడ్డి

సీతారామపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రంగనాయుడుపల్లి గ్రామానికి చెందిన కల్లూరి పెద్ద వెంకట సుబ్బారెడ్డి తన బైక్ పై రంగనాయుడుపల్లి నుంచి సీతారామపురం గ్రామానికి వస్తున్నాడు. అయ్యవారిపల్లి గ్రామ సమీపంలోని నేషనల్ హైవేపై ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి పక్కనే వస్తున్న మరో బైక్‌ని ఢీ కొట్టడంతో కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు 108 ద్వారా ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందన



పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి అభినందనలు అందుకున్న విద్యార్థులు

సంగం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివి ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అపస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సంగం, కొరిమెర్ల, తరుణవాయి, గాంధీ జన సంఘం, మర్రిపాడు, దువ్వూరు, అన్నారెడ్డిపాళెం ఉన్నత పాఠశాలల్లో పదిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అపస్ మెమెంటోలతో సత్కరించింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో జానకీరామ్ మాట్లాడుతూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని మిగతా పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు టీచర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అపస్ నాయకులతోపాటు అన్ని పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

సీతారామపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేనిపల్లిలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ మల్లెల సురేష్, యూనిట్ ఇన్‌చార్జి మాలిబాబు ఆధ్వర్యంలో రైతులు, మహిళా సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాలిబాబు మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేయాలని, పెరటి తోటలు పెంపకం, ఏటీఎమ్, ఏ గ్రేడ్ మోడల్స్ వేసుకొని మంచి దిగుబడులు సాధించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ రైతులకు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం వారికి విత్తనాల సంచులను అందజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మీ ప్రశాంతి, పద్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



చిన్నారులకు పాఠాలు నేర్పుతున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరాజు

ఏఎస్‌పేట,మే6(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి ఓ. శ్రీనివాసరాజు తెలిపారు.మంగళవారం ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాలలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు.పిల్లలకు నీతి కథలు,దేశభక్తి గీతాలు,జానపద గేయాలు నేర్పించారు.అనంతరం బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాణేల సేకరణకర్త ఎండీ వాయిజ్, పోస్ట్ మన్ ఉమామ్,తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి మండల జేవీవీ కార్యవర్గం ఏర్పాటు

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీమంజిల్‌లో మంగళవారం జేవీవీ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ దస్తగిరి అహ్మద్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జీసీ ఓబుల్‌రెడ్డి, షేక్ నస్రుల్లా, అధ్యక్షుడిగా షేక్ మున్నా, ప్రధాన కార్యదర్శిగా షేక్ మసూద్, కోశాధికారిగా కంచుపాటి రమేష్, ఉపాధ్యక్షులుగా సంగన భాస్కర్‌రెడ్డి, షేక్ ఖాజాపీర్, దావూద్, కార్యదర్శులుగా అశోక్, మహ్మద్‌అలీ, షేక్ షబ్బీర్‌ను ఎంపిక చేశారు.కొత్త కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిలానీబాషా, మాలకొండారెడ్డి, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌర సేవలను జాగ్రత్తగా అందించండి : జేసీ

నెల్లూరు (హరనాథపురం) మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందించే పౌరసేవలు గురించి ప్రభుత్వం అనునిత్యం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నందున, అత్యంత జాగ్రత్తగా సేవలను అందించాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సూచించారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో రీసర్వే, డిజిటలైజేషన్, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవెన్యూ సంబంధిత విషయాలపై ఆత్మకూరు డివిజన్ తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా రెవెన్యూ రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ముందుగా అందుబాటులో ఉన్న రికార్డుల జాబితా తయారు చేయాలని ఆదేశించారు. ఆత్మకూరు డివిజన్‌లో మొత్తం 26,252 నోషనల్ ఖాతాలున్నాయని వాటి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

లో 449 ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే రైతుల వద్ద నుంచి నీటి తీరువా పన్నులను వసూలు చేయాలని జేసీ ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు వహించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవో పావని, సర్వే ఏడీ నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 500

న్యూస్ బాక్స్

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ఉలవపాడు, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరేడు గ్రామం రెడ్డిపాలెం శివారు ప్రాంతంలో జరుగుతున్న కోడి పందేల స్థావరంపై మంగళవారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి ఎస్‌ఐ అంకమ్మ దాడులు చేశారు. 10 మంది కోడి పందెం జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 పందెం కోళ్లు, 10 బైకులు, రూ.18,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కిశోరి వికాసంతోనే సమాజాభివృద్ధి

వలేటివారిపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికల వికాసంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ కందుకూరు ప్రాజెక్టు సీడీపీవో శర్మిష్ఠ తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, నూకవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోరి బాలికల వికాశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, కార్యకర్తలు మృదుల, సుమలత, ఏఎన్‌ఎంలు లావణ్య, అనీత, తదితరులు పాల్గొన్నారు.

బాలికల స్వీయ రక్షణపై అవగాహన ఉండాలి

కలిగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికల స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాలని వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పద్మజకుమారి పేర్కొన్నారు. మండలంలోని పెదకొండూరులో మంగళవారం జరిగిన కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హైమావతి, అంగన్‌వాడీ వర్కర్ షాహిదా, కిశోర బాలికలు, పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో ఎంపీడీవో తనిఖీ

వలేటివారిపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేకునాంపురం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో నరేంద్ర దేవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరు, మూమెంట్ రిజిస్టరును తనిఖీ చేశారు. ఈ సమయంలో వీఆర్వో మినహా మిగిలిన సిబ్బంది అందరూ విధుల్లో ఉన్నట్లు తెలిపారు.

లైవ్‌స్టాక్ అసిస్టెంట్ అనుపమకు పదోన్నతి

వలేటివారిపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోకూరు పశువైద్యశాలలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బొప్పరాజు అనుపమకు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. దీంతో ఆమెను ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొలసానకోట గ్రామీణ పశువైద్యశాలకు బదిలీ చేశారు.

మోటారు, కేబుల్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

కొండాపురం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ తాగునీటి పథకంకు సంబంధించిన మోటారు, కేబుల్ గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. జలజీవన్ మిషన్ కింద మూడు వాటర్ స్కీములు ఉండగా గరిమెనపెంట గ్రామానికి చెందిన నీటి సరఫరాకు స్థానిక పిల్లాపేరువాగులో ఉన్న 5 హెచ్‌పీ మోటారు, కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

లింగసముద్రం, మే 6(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలో పారిశుధ్యం మెరుగుకు సర్పంచు పులి రాఘవులు, పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు మంగళవారం చర్యలు చేపట్టారు. గత ఏడాది డిసెంబరులో పంచాయతీలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రస్తుతం మురుగు కాలువల్లో చెత్తా చెదారం పేరుకొని పోయి దుర్వాసన వస్తుండడంతో పాటు దోమలు వ్యాపించడంతో ప్రజల వినతి మేరకు కాలువల్లో పారిశుధ్య కార్మికులు మురుగు, చెత్తాచెదారం తొలగించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజులు లింగసముద్రంతో పాటు పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టిన అనంతరం బ్లీచింగ్ చల్లించి, ఎబేట్ మందు స్ప్రే చేయిస్తామని చెప్పారు.

ఇన్‌చార్జి ఏపీవోగా దయా సాగర్

లింగసముద్రం, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం మండల ఇన్‌చార్జి (ఎఫ్‌ఏసీ) ఏపీవోగా దయాసాగర్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఓగా పని చేస్తున్న షేక్ సమీర్‌బాషా ఈనెల 4వ తేదీ నుంచి 45 రోజుల పాటు సెలవుపై వెళ్లిపోయారు. అలాగే లింగసముద్రం ఉపాధిహామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న రేఖ సెలవుపై వెళ్లగా, మధు అనే మరో కంప్యూటర్ ఆపరేటర్ బదిలీపై వెళ్లారు. దీంతో జలదంకి మండలం ఉపాధి హామీ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ కె.మల్లికార్జునను నియమించగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.



అడవిరాజుపాలెంలో అలంకారప్రాయంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

- లక్షలు వెచ్చించి నిర్మించినా ఫలితం శూన్యం
- 80 శాతం పూర్తి.. మిగిలిన పనులకు అడ్డంకులు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు
- తాగునీటికి కటకటలాడుతున్న అడవిరాజుపాలెం వాసులు
- ట్యాంకర్ల నుంచి నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి

రక్షిత మంచినీటి పథకానికి

రాజకీయ గ్రహణం!?

గుడ్లూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిరాజుపాలెంలో తాగునీటి పథకం పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులు చివరి దశలో అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రజలు తాగునీటికి కటకటలాడుతోన్నారు. ఈ క్రమంలో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి వినియోగించుకొంటున్నారు. అయినా అధికారులు తమకెందుకులే అన్నట్లు చోద్యం చూస్తున్నారు. దీంతో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడు అన్నచందంగా మారింది గ్రామస్థుల పరిస్థితి. వివరాల మేరకు... అడవిరాజుపాలెంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 2023-24 ఆర్థిక సంవత్సరంలో జలజీవన్ మిషన్ కింద రూ.43 లక్షల మంజూరయ్యాయి. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 20 శాతం పనులు ముందుకు సాగనివ్వకుండా అధికారులే అడ్డంకులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఆరేడు నెలలుగా జలజీవన్ మిషన్ పనులు నిలిచిపోవటంతో లక్షలు వెచ్చించినా ప్రయోజనం లేకుండాపోయిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు అనుగ్రహిస్తే రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి గ్రామంతో పాటు ఎస్సీ, బీసీ కాలనీలకు కొరతలేకుండా నీరందిస్తానని గ్రామసర్పంచు వారిచుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పటం లేదు. టెండర్ దక్కించుకున్న గ్రామ సర్పంచు వి.నాగేశ్వరరావు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంతో పాటు కొంతమేర ప్రధాన పైపులైన్లు, నీటి ఆధారంగా ఉన్న బావి, బోర్లు నుంచి ఓవర్ హెడ్‌ట్యాంకు వరకు పైపులైను నిర్మాణ పనులు కూడా పూర్తి చేయించారు. ఇక చేయాల్సిందల్లా ఎస్సీ బీసీ కాలనీలకు రమారమి 3 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మాణం, కనెక్టివిటీ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి కూడా అవసరమైన పైపుల కొనుగోలు, పైప్‌లైన్ల నిర్మాణం కోసం ఎర్త్‌వర్క్ లాంటి పనులు కూడా ఆరునెలల క్రితమే పూర్తయ్యాయి. అయితే మిగిలిన ఈ పనులు తాము చేయాల్సిందేనంటూ ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు పట్టుబట్టడంతో పనులు నిలిచిపోయాయి. టెండర్ అగ్రిమెంటు అంతా జరిగి 80 శాతం పనులు పూర్తవటమే గాక మిగిలిన పనికి అవసరమైన మెటీరియల్ కూడా కొనుగోలు చేసి ఉన్న దశలో అదిసాధ్యం కాదని వారికి వాస్తవ పరిస్థితిని వివరించి త్వరితగతిన పనులు చేయించి ప్రజలకు తాగునీరందించాల్సిన అధికారులు అదంతా మాకెందుకులే అన్నట్లు పనులు నిలిపివేయించి కూర్చోవడంపై పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు మండుటెండల్లో దాహార్తితో అల్లాడిపోతుండటమేగాక గృహ అవసరాలకు కూడా నీటిని కొనుగోలుచేసి ట్యాంకర్లతో తోలించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అధికారులు, పాలకులు తగినచర్యలు తీసుకుని అడవిరాజుపాలెం గ్రామస్థుల దాహం తీరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పూడిపోతున్న పైపులైన్ల కోసం తీసిన గోతులు



అధికారులు అనుమతించకపోవడంతో పక్కన పడేసిన పైపులు

త్వరలో పనుల ప్రారంభానికి చర్యలు

అడవిరాజుపాలెంలో గతంలో అగ్రిమెంటు జరిగి 80 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. అయితే ఇటీవల స్థానికంగా ఒకరిద్దరు ఆపని మేము చేయాలని అడ్డంకులు సృష్టిస్తుండగా అది సాధ్యం కాదని చెప్పాం. దీంతో సమస్య వచ్చి పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ప్రజల తాగునీటి కష్టాలు తీరుస్తాం.

- రాజశేఖర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

వైద్య సిబ్బందికి 'హంస' అండగా ఉంటుంది

కలిగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): వైద్య శాఖలో పనిచేసే సిబ్బందికి ఏపీ హంస అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కప్పా నారాయణ పేర్కొన్నారు. రేపల్లె అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తూ పని ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడిన సింగోటి కోటేశ్వరమ్మకు స్థానిక పీహెచ్‌సీలో సిబ్బంది మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస అసోసియేషన్ వింజమూరు తాలూకా సభ్యులు ఎస్ సాయిలక్ష్మి, తిరుపతిరావు, నలిశెట్టి లక్ష్మీప్రసాద్, షేక్ రియాజ్, ఆశా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అవగాహన తప్పనిసరి

● ఉమాశంకర్, ఎస్‌ఐ

కలిగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రజలకు చేరువ అవుతోంది. అలాంటి సోషల్ మీడియాపై స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఉమా శంకర్ తెలిపారు.



? సోషల్ మీడియాపై అవగాహన లేకపోతే తలెత్తే ఇబ్బందులేవి.

! ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరు సోషల్ మీడియాలో వచ్చే విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించే వార్తలను ఫార్వర్డ్ చేస్తే చట్టప్రకారం శిక్షింపబడుతారు.

? సైబర్ నేరాలకు ఎలా పాల్పడతారు.

! సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం.. మీ బంధువులు అరెస్టు అయ్యారు.. మీకు లాటరీ తగిలింది.. పోస్టు ఖర్చులు పంపిస్తే బహుమతి ఇంటి వద్ద అందుతుంది. మీరు చట్టవిరుద్ధమైన వస్తువులు కలిగి ఉన్నారు.. జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.. అంటూ అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

? సైబర్ నేరగాళ్ల నుంచి ఎలా తప్పించుకోవాలి.

! సైబర్ నేరగాళ్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు ధైర్యంగా ఉండాలి. అకౌంట్ నెంబర్లు, ఓటీపీలు చెప్పకూడదు. బ్యాంకు ఖాతా నుంచి నగదు పోతే వెంటనే 1930కి కాల్ చేస్తే అకౌంట్‌ను హోల్డ్ చేస్తారు. బ్యాంకు వద్దకు వెళ్లి తగిన ఆధారాలు చూపితే నగదు తిరిగి అకౌంట్‌కు జయచేయడానికి చర్యలు తీసుకుంటారు.

ఇంటింటి సర్వే పూర్తి చేయాలి : డీఐవో

కందుకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆశా యాప్‌లో పొందుపరిచిన ఇంటింటి సర్వేను ఆశా వర్కర్లు తక్షణం పూర్తి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టరు ఉమామహేశ్వరి తెలిపారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె పట్టణంలోని అడ్వాన్స్‌డ్ హెల్త్ సెంటర్లు, మాచవరం పీహెచ్‌సీలను సందర్శించి ఆశా సర్వే రికార్డ్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆశాలు నూరు శాతం విజయవంతంగా నిర్వహించేలా వారికి అవగాహన కల్పించటంతో పాటు వైద్యాధికారులు, నోడల్ ఆఫీసర్లు బాధ్యతతో పర్యవేక్షించాలని కోరారు.



కందుకూరు : మాట్లాడుతున్న డీఐవో డాక్టరు ఉమామహేశ్వరి



చిట్రగుంట : ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న డాక్టర్ నిత్యప్రశాంతి

మాతా శిశు సంరక్షణపై అవగాహన

చిట్రగుంట : మాతా శిశు సంరక్షణ, వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించాలని వైద్యాధికారి నిత్యప్రశాంతి పేర్కొన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, ఆశాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీన్‌కుమార్, రాజశేఖరన్, పీహెచ్‌వో సులోచన, తదితరులు పాల్గొన్నారు.

కొత్త యాప్‌లో సర్వే వివరాలు

లింగసముద్రం : కొత్తగా రూపొందించిన యాప్‌లో అన్ని రకాల సర్వే వివరాలను ఆశా వర్కర్లు నమోదు చేయాలని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ .రమేష్ చెప్పారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో కొత్త యాప్‌పై ఆయన అవగాహన కల్పించారు. ఆశాలు ఇంటింటి సర్వే నిర్వహించి గర్భిణులు, బాలింతలు, జనన మరణాల సర్వేతో పాటు సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల వివరాలను నమోదు చేసి కొత్త యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అలాగే జాతీయ కార్యక్రమాలన్నింటిలో నూరు శాతం లక్ష్యాలను సాధించాలని చెప్పారు.

ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల కేటాయింపుపై సమీక్ష

కావలి, మే 6(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం బాపూజీనగర్‌లో గతంలో మున్సిపాల్టీ వేసిన లేఅవుట్‌లో మిగిలి ఉన్న 79 ఇంటిగ్రేటెడ్ డవలప్‌మెంట్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం టన్ (ఐడీఎస్‌ఎంటీ) ప్లాట్లు కేటాయింపుపై లోకల్ లెవల్ కోఆర్డినేషన్ కమిటీ (ఎల్‌ఎల్‌సీసీ) మంగళవారం కావలి మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సమావేశమైంది. కమిటీ అధ్యక్షుడైన గుంటూరు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ, సభ్యులు గుంటూరు రీజనల్ డైరెక్టర్ టౌన్‌ప్లానింగ్ మధుకుమార్, కావలి ఆర్డీవో ఎం. వన్నీ వంశీకృష్ణ, నెల్లూరు పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు సమావేశమై ప్లాట్లు ఏ ప్రాతిపదికన ప్రజలకు కేటాయించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వాటి స్థితిగతులు తెలుసుకున్న తర్వాతనే తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. అయితే గతంలో ఆ ప్లాట్ల కేటాయింపు కోసం కొంత మంది అప్పటి వాటి విలువలో 10 శాతం డిపాజిట్ కట్టి ఉన్నారు. అయితే కోర్టు వివాదాల కారణంగా కేటాయింపులు ఆగిపోయాయి. అయితే ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ విపరీతంగా పెరగడంతో మార్కెట్ ధర ప్రకారం వాటి రేట్లు పెంచి కేటాయించాలా లేక వేలం పాట ద్వారా ఎవరు ఎక్కువ ధరకు పాడితే వారికి కేటాయించాలా అనేదానిపై చర్చించినట్లు తెలిసింది. గతంలో ప్లాట్ల కోసం డిపాజిట్లు కట్టిన వారు కోర్టుకు వెళ్లకుండా వారిని ఎలా సంతృప్తి పరచాలనే దానిపై కూడా చర్చించి నట్లు తెలిసింది. ఏదిఏమైనా వేలం పాటకే ప్రాధాన్యత ఇస్తే మున్సిపల్ ఆదాయం పెరుగుతుందనే భావం వ్యక్తపరిచినట్లు తెలిసింది. కమిటీ అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ అనుమతి మేరకు తదుపరి నిర్ణయం తీసుకొనేందుకు అధికారులు నిర్ణయించారు.

నేరాల నియంత్రణకు డ్రోన్ ఉపయోగం

● కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలు పోలీసుశాఖకు ఎంతగానో ఉపయోగపడతాయని కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. విపత్తుల సమయాల్లో బాధితులను ఆదుకునేందుకు డ్రోన్‌ల పనితీరు ఇప్పటికే నిరూపితమైందని తెలిపారు. ఇండోసోల్ సోలార్ ఎనర్జీ కంపెనీ వారు కందుకూరు డీఎస్పీ కార్యాలయానికి అత్యాధునిక సాంకేతికతతో కూడిన డీజేఐ ఎయిర్ 3ఎస్ డ్రోన్‌ను మంగళవారం అందజేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచనతో ఈ డ్రోన్‌ను పోలీసుశాఖకు అందజేస్తున్నట్లు ఇండోసోల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ డ్రోన్ కెమెరా అత్యధిక రెజిల్యూషన్ కలిగిన వీడియోలు, ఫొటోలు తీయగలదని, దీనిద్వారా విస్తృత ప్రాంతాల్లో నిఘా ఉంచటానికి, నేరస్తులను పరిశీలించటానికి, ట్రాఫిక్‌ను పర్యవేక్షించటానికి కూడా వీలవుతుందని తెలిపారు. అటవీ ప్రాంతాలు, తోటలు, ఎడారులు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో జరిగే వివిధ అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి దాడులు చేసేందుకు ఈ డ్రోన్ కెమెరా ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్‌ఐ వెంకటరావు, ఇండోసోల్ సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు డ్రోన్ కెమెరాను అందజేస్తున్న ఇండోసోల్ కంపెనీ ప్రతినిధులు

మండల సమావేశానికి ఎంపీటీసీల డుమ్మా

● కోరం లేక వాయిదా

కావలి రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల పరిషత్ సాధారణ సమావేశానికి వైసీపీ ఎంపీటీసీలు డుమ్మా కొట్టారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది. సమావేశానికి హాజరైన ఎంపీపీ ఆలూరు కొండమ్మ, జడ్పీటీసీ జంపాని రాఘవులు, సర్వాయపాలెం, తుమ్మలపెంట ఎంపీటీసీలు జంపాని శ్రీనివాసులు, మునెమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, ఆముదాలదిన్నె, కొత్తపల్లి, ఆర్సీపాళెం సర్పంచులు ఊడా బ్రహ్మానందం, చిమ్మిలి శ్రీహరినాయుడు, పేముల రాజేంద్ర, ఎంపీడీవోతోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వీరంతా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సభ్యుల కోసం ఎదురు చేశారు. కానీ పలువురు వైసీపీ ఎంపీటీసీలు కార్యాలయం వద్దకు వచ్చినా సమావేశానికి హాజరుకాకుండా చెట్ల కిందనే ఉండడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు.



ఎంపీడీవోతో కలిసి సమావేశానికి హాజరైన ఎంపీపీ కొండమ్మ

లింగనిర్ధారణ నిషేధిత చట్టాన్ని అతిక్రమించొద్దు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో రజని

కందుకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ నిషేధిత చట్టాన్ని ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు రజనీ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రఘు డయగ్నోస్టిక్స్ సెంటర్, అత్తోట హాస్పిటల్స్, ప్రభుత్వ ఏరియా వైద్యశాలల్లోని స్కానింగ్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భాధారణకు, ప్రసవానికి ముందు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వడ్డెపాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హైరిస్క్ గర్భిణుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసులు, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి బ్యూలాగ్రేస్, సీహెచ్‌ఎన్ ఉన్నం పద్మ తదితరులు పాల్గొన్నారు.



స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు రజని

అల్లుకున్న నిర్లక్ష్యం!

వలేటివారిపాలెంలోని ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్‌లో పొలాలకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలకు తుప్పర్లు తీగలు దట్టంగా అలుకోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి ఇది నిలువుదట్టంగా మారింది. ఈ తీగలు వలన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అవుతుందని, విద్యుత్ స్తంభానికి కూడా విద్యుత్ సరఫరా జరిగి పంట పొలాల్లోకి వెళ్లే వారికి షాక్ కొడుతోందని రైతులు పేర్కొంటున్నారు. అంతేగాకుండా మూగజీవాలు కూడా విద్యుత్ ప్రమాదాలతో మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి విద్యుత్ స్తంభం చుట్టూ అల్లుకున్న తీగలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)



వలేటివారిపాలెంలో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు

కుంగిన సీసీ రోడ్డుతో పొంచిఉన్న ప్రమాదం

కావలి పట్టణం క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డులో కుంగిన సీసీ రోడ్డుతో ప్రమాదం పొంచిఉంది. ఈ ప్రాంతంలో అధికంగా వైద్యశాలలు, కళాశాలలు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో గతంలో నిర్మించిన సీసీ రోడ్డు మధ్యలో కొంత మేరకు కుంగడంతో వేగంగా వచ్చే వాహనాలు ఆ గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలిరూరల్,(ఆంధ్రజ్యోతి)



క్రిస్టియన్‌పేట ప్రధాన వీధిలో దెబ్బతిన్న సీసీ రోడ్డు

పాఠశాల ప్రహరీ నిర్మించరా?

వలేటివారిపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలోని ఎంపీపీ స్కూల్ ప్రహరీ గోడను మూడేళ్ల క్రితం కొంతభాగం కూలదోశారు. దానిని తిరిగి నిర్మించకుండా అలాగే వదిలేశారు. దీంతో పాఠశాల ఆవరణంలో అపరి శుభ్రత వాతావరణం నెలకొంది. వివరాల మేరకు.. వలేటివారిపాలెం హైస్కూల్‌కు నాబార్డు నిధులు రూ.95 లక్షలతో నాడు-నేడు రెండవ విడతలో 8 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. అయితే స్థానిక హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం లేకపోవడంతో హైస్కూల్‌ను ఆనుకొని ఉన్న ఎంపీపీ స్కూల్‌లో అదనపు తరగతి గదులు నిర్మించాలని నిర్ణయించారు. దీంతో ఎంపీపీ స్కూల్ ఆవరణలో అదనపు తరగతి గదులు నిర్మాణానికి మెటీరియల్ తోలుకునేందుకు ఎంపీపీ స్కూల్ ప్రహరీ గోడ కొంతభాగం తొలగించి దారి ఏర్పాటు చేశారు. అనంతరం నిధులు రాకపోవడంతో అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. అయితే తొలగించిన ప్రహరీని మళ్లీ నిర్మించలేదు. ఈ క్రమంలో ఎంపీపీ స్కూల్‌లోని తరగతి గదులను, టాయ్‌లెట్లను ఆకతాయిలు అపరిశుభ్రత చేస్తున్నారు. అంతేగాకుండా పాఠశాల తరగతి గదుల ఆవరణను బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముక్కుపుటాలదిరేలా దుర్వాసన వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.



వలేటివారిపాలెం ఎంపీపీ స్కూల్‌లో ప్రహరీ కూలదోసి ఏర్పాటు చేసిన దారి

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు అల్లూరుకు చెందిన బడబాగ్ని ఆంజనేయరాజు. సంకల్పం గట్టిదైతే విజయం వరిస్తుందని నిరూపించారాయన. బడబాగ్ని రంగస్థల నాటకాల నుంచి సినీ రంగ ప్రవేశం వరకు ఆయన ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. కుటుంబ బంధాలు, బాధ్యతలు వెనక్కు లాగుతున్నా తన ప్రయత్నం మాత్రం మానలేదు. ఆ ప్రయత్నంతోనే రంగస్థలం నుంచి కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు వరకు ఎదిగారు ఆంజనేయరాజు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

'బొమ్మా బొరుసు' సీరియల్‌లో...





'సూరిగాడు' సినిమాలో బ్రహ్మానందంతో బడబాగ్ని

భళాబాగ్ని!

- ఏకపాత్రాభినయంలో దిట్ట ఆంజనేయరాజు
- పెద్దోడు, జింగిడిగాడుతో గుర్తింపు
- రంగస్థలం నుంచి సినీ రంగంలోకి ప్రవేశం
- ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు

బడబాగ్ని ఆంజనేయ రాజు నెల్లూరు జిల్లా అల్లూరు గ్రామవాసి. అల్లూరులోని బడబాగ్ని హనుమంత రాజు, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు ఆంజనేయరాజు. అల్లూరులోనే ఇంటర్ చదువుతున్న రోజుల్లో రామకృష్ణ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఏకపాత్రాభినయం ప్రదర్శించి ప్రథమ బహుమతిని సాధించడం ఆయన ప్రగతికి మొదటి మెట్టు. అప్పుడే నిర్ణయించుకున్నాడు వెండితెరపై వెలగాలని. వివాహ అనంతరం కుటుంబ బాంధవ్యాలు, బాధ్యతలను భుజాన వేసుకున్నా నటనపై ఆశలు వదలక తన ప్రయాత్నాన్ని కొనసాగించారు.

● రాష్ట్రవ్యాప్తంగా బహుమతులు

బడబాగ్ని ఆంజనేయరాజు రంగ స్థలంలో ఏకధాటిగా ఏకపాత్రాభినయంతో ప్రేక్షకులను మెప్పించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన అనేక కళాపరిషత్‌లలో ఆయనది అందెవేసిన చేయిగా నిలిచారు. 1988లో జరిగిన టీడీపీ మహానాడులో అప్పటి ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్‌టీ.రామారావు ఎదుట పెద్దోడు పాత్రను ఏకపాత్రాభినయంలో ప్రదర్శించి ప్రథమ బహుమతిని అందుకున్నారు. నెల్లూరు 'జేసీస్' సంస్థలో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లోనూ ప్రథమ బహుమతి సాధించారు. మద్రాస్ ఆంధ్రా క్లబ్‌లో ప్రదర్శించిన ఈయన నటనకు పులకించిపోయిన ప్రఖ్యాత హాస్యనటుడు అల్లు రామలింగయ్య తన నటనా వారసుడిగా ప్రకటించడంతో అప్పుడే బడబాగ్ని విజయానికి తార్కాణంగా నిలిచింది. ప్రతికథానాయకుడిగా పేరొందిన రాజనాల ద్వారా సన్మానాన్ని అందుకున్నారు. ఇటీవల ఒంగోలులో రంగభూమి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి ఏకపాత్రాభినయం పోటీల్లో ఎందరో ఉద్దండుల నడుమ ఆయన ప్రదర్శనకు తృతీయ బహుమతి దక్కింది. ఈ విధంగా బడబాగ్ని ఆంజనేయరాజు అల్లూరు పెద్దోడు నుంచి అవార్డుల పెద్దోడుగా నటనా రంగంలో విజయాలను సాధించారు.



నెల్లూరు కళాంజలి సంస్థ నుంచి ఘన సత్కారం పొందుతున్న బడబాగ్ని దంపతులు

● ఒంటరిగానే ప్రయాణం

పెద్దోడుగా పేరొందిన ఆంజనేయరాజు ఎక్కడ ప్రదర్శనలు ఇవ్వాలన్నా, పోటీల్లో పాల్గొనాలన్నా ఒక్కడే వెళ్లేవారు. వ్యయప్రయాసలన్నీ తానే భరించి తన మేకప్ తానే వేసుకొని సమర్థవంతంగా ప్రదర్శించి ఎన్నో విజయాలను కైవసం చేసుకున్నారు.

● నటించిన సినిమాలు, గుర్తింపులు

శ్రీరామచంద్రులు, ఆగ్రహం, చిన్నారి స్నేహం, సూరిగాడు, మొండి మొగుళ్లు-పెంకి పెళ్లాలు, ప్రేమవిజేత తదితర సినిమాలు, అమెరికాలో అందాలరాశి, చిరుజల్లులు, మనసులో మాట, జై సంతోషి మాత, జలతారుదీపాలు, బొమ్మ బొరుసు సీరియళ్లలో ఆయన అనేక పాత్రల్లో నటించారు. 'జింగిడిగాడు' అనే గిరిజన జీవిత అంశాన్ని వివరించే ఈ పాత్రతోపాటు రాజకీయ నాయకులు పేదలను మోసం చేసే చతురతను ఎదుర్కొని వారి స్వార్థాన్ని ఎండగడుతూ ప్రదర్శించే 'పెద్దోడు' ఈ రెండు ఏకపాత్రాభినయాలకు రంగస్థల నాటకాలు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపును తెచ్చాయి. రంగ స్థల నటుడి నుంచి కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడి వరకు ఎదిగారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో తాను ఇంత దూరం ప్రయాణం సాగించగలిగానని ఆయన చెబుతుంటారు. నెల్లూరు కళాంజలి సంస్థ నిర్వాహకులు సారథ్యంలో ఆంజనేయరాజు దంపతులను మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి సత్కరించారు.

మళ్లీ జన్మంటూ ఉంటే కళాకారుడిగానే పుడతా

చిన్నప్పటి నుంచి నటనపై నాకున్న మక్కువ రంగ స్థలం నుంచి కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడి వరకు తీసుకెళ్లింది. నా ప్రయాణంలో చివరి మజిలీకి చేరుకున్నా. నేను సాధించిన ఈ విజయాలన్నీ సంతృప్తినిచ్చాయి. మళ్లీ జన్మంటూ ఉంటే కళాకారుడిగానే పుట్టాలని ఉంది. నా నటనతో ప్రేక్షకులను మెప్పించాలని ఉంది. జింగిడి గాడు, పెద్దోడుగా నాకు వచ్చిన ఈ పేరు ప్రఖ్యాతులు అల్లూరు ప్రజలకు అంకితం.

- బడబాగ్ని ఆంజనేయరాజు, అల్లూరు



PRATIBHA

మద్యం మత్తులో అనైతికంగా..

● జీజీహెచ్‌లో పీజీ వైద్యుడి నిర్వాకం

నెల్లూరు (వైద్యం), మే 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వైద్యులను దేవుడితో సమానంగా చూస్తారు. అయితే నెల్లూరు జీజీహెచ్‌లో పని చేసే ఓ పీజీ వైద్యుడు బాధ్యతలను, సంస్కారాన్ని మరిచి ప్రవర్తించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని ఎముకలు, కీళ్ల విభాగంలో స్పెషలిస్ట్ వైద్యం కోర్సు చేసేందుకు నాలుగు నెలల క్రితం ఓ వ్యక్తి పీజీ వైద్యునిగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరాడు. అయితే వచ్చిన నెలలోనే ఎంబీబీఎస్ కోర్సు చదువుతున్న విద్యార్థులపై చేయి చేసుకున్నాడు. దీనిపై ఆ విద్యార్థి ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాడు. దీంతో ఉన్నతాధికారులు ఆ పీజీ వైద్యుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇది జరిగిన రెండో నెలలోనే ఆసుపత్రిలో జరిగే విషయాలను తల్లిదండ్రుల కు చేరవేస్తున్నాడన్న అనుమానంతో ఓ జూనియర్ డాక్టర్‌ను ఓపీ నుంచి బయటకు లాక్కొచ్చాడు. ఈ సంఘటనలతో సదరు పీజీ వైద్యుడిని అధికారులు హాస్టల్ నుంచి బయటకు పంపించారు. కాగా, గత శనివారం మరో సంఘటన చోటుచేసుకుంది. ఆ రోజు పీజీ వైద్యుని డ్యూటీ కాదు. అయినా జీజీహెచ్‌లోని వార్డుకు ఎందుకు వచ్చాడో తెలి యదు. ఫూటుగా మద్యం సేవించి తూలిపోతు న్నాడు. రోగి అటెండర్‌తో వాగ్వివాదానికి దిగా డు. దీంతో జూనియర్ వైద్యుడు ఆ పీజీ వైద్యు డిని పక్కకు తీసుకెళ్లాడు. ఈ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్‌గా మారింది. ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రోగులు, ఆసుపత్రి సిబ్బంది కోరుతున్నారు.

హాస్టళ్లలో మరమ్మతులు పూర్తి చేయండి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతు పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఇంజనీరింగ్ అధికా రులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో అధికారులు, వార్డెన్లతో ఆయన సమీక్షిం చారు. జిల్లాలో 64 హాస్టళ్లలో మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.9.32 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులందరూ హాస్టళ్లకు తిరిగివచ్చే లోగా ఈ పనులన్నీ పూర్తి కావాలని సూచించారు. హాస్టళ్లలో నూటికి నూరు శాతం సీట్లు భర్తీ అయ్యేలా ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డె న్లు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది పదో తరగతిలో కొన్ని హాస్ట ళ్ల తక్కువ ఉత్తీర్ణత శాతం సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితాలు తగ్గడానికి గల కారణాలను తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి, పంచా యతీరాజ్, ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు, జీ రామకృష్ణప్రసాద్, సుబ్బరాజు పాల్గొన్నారు.

మమ్మల్ని రాజకీయాల్లోకి లాగకండి!

● వెంకటగిరి రాజాస్ కుటుంబీకుల కంపెనీ

నెల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తమ కంపెనీకి క్వార్ట్జ్ తవ్వకాలకు అనుమతులు రాకుండా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని వెంకటగిరి రాజాస్ కుటుంబీకులు ప్రకటించారు. జగన్ పత్రికలో వస్తున్న కథనాలు అవాస్తవమంటూ వెంకటగిరి రాజా కుటుంబీలకు చెందిన శ్రీకల్యాణరామ కంపెనీ పేరిట మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మైనింగ్ శాఖలో కొందరు చేస్తున్న తప్పులతో తమ కంపెనీకి అనుమతులు రాలేదని, ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అంతేతప్ప వేమిరెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తమను రాజకీయాల్లోకి తీసుకురావద్దంటూ విజ్ఞప్తి చేశారు. 2021లో తమ కంపెనీ రెన్యువల్ అనుమతులు పొందడంలో అప్పట్లో ఎంపీగా ఉన్న వేమిరెడ్డి సహకరించారని ఆ ప్రకటనలో గుర్తు చేశారు.

నగరంలో ఉదయగిరి వాసి హత్య!

- ఇంట్లోకి దూరి కత్తులతో ముఖంపై నరికి..
- సుఫారీ హత్యా.. ఇతర కారణాలా..!?
- పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

నెల్లూరు(క్రైం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి దారుణ హత్య జరిగింది. ఉదయగిరి మండలం సర్వరబాదు గ్రామానికి చెందిన చిన్నయ్య ఉరాఫ్ చిన్నా (40)ను గుర్తుతెలియని వ్యక్తులు నగరంలోని వెంకటరెడ్డినగర్‌లో ఇంట్లో నిద్రిస్తుండగా ఈనెల 5వ తేది రాత్రి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.

ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామం ఎస్సీ కాలనీలోని గొల్లపల్లి ఓబయ్య, లక్ష్మమ్మలకు నలుగురు కుమారులు. పెద్ద కుమారుడు గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్నా (40), వెళాంగణిలు దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వివాహం అనంతరం చిన్నయ్య ఉదయగిరి మండలంలోని గొల్లపాలెంలో కాపురం పెట్టారు. సీతారామపురం మండలం బసినేనిపల్లి పశు వైద్యశాలలో కాంట్రాక్టు పద్ధతిన అటెండర్‌గా పని చేస్తున్నాడు. అధికారులు పిలిచినప్పుడు మాత్రమే ఈయన విధులకు హాజరవుతూ ఉంటాడు. అయితే, పదేళ్ల క్రితం నెల్లూరులోని వెంకటరెడ్డి నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అదే ఇంట్లో మొదటి అంతస్తులో రెండు గదులను అద్దెకు తీసుకొని ఫైనాన్స్, రియల్‌ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. శని, ఆది వారాల్లో భార్య, పిల్లల వద్దకు వెళ్లి తిరిగి సోమవారం నగరానికి చేరుకుంటాడు. ఈ క్రమంలో 5వ తేదీ సోమవారం రాత్రి చిన్నయ్య తన ఇంటిలోని హాలులో పడుకోగా, స్నేహితుడు వెంకటేశ్వర్లు బెడ్‌రూమ్‌లో నిద్రించారు. ఏం జరిగిందో ఏమో గానీ సోమవారం ఉదయం వెంకటేశ్వర్లు నిద్రలేచి చూసే సరికి హాల్‌లో చిన్నయ్య రక్తపు మడుగులో మృతి చెంది ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే స్థానికుల సహాయంతో వేదాయపాలెం పోలీసులకు సమాచారం అందించారు.



రోదిస్తున్న మృతుడి బంధువులు

● డాగ్‌స్క్వాడ్ పరిశీలన

హత్య జరిగిన ప్రాంతానికి డాగ్ స్క్వాడ్ చేరుకుంది. మృతదేహం వద్ద నుంచి డాగ్ గాంధీనగర్ వైపుగా కొద్ది దూరం పరుగులు తీసి తిరిగి వచ్చేసింది. ఫింగర్ ప్రింట్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. నగర డీఎస్పీ సింధుప్రియ, వేదాయపాలెం ఇన్‌చార్జ్ సీఐ రోశయ్యలు సంఘట స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి తమ్ముడు రాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి ఓబయ్యతోపాటు బంధువులు వెంటనే నగరానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. హత్య విషయం తెలుసుకున్న స్థానికులు భారీగా సంఘటన స్థలానికి చేరుకున్నారు.

● ఏం జరిగి ఉంటుందో!

హత్య జరిగిన రోజు రాత్రి చిన్నయ్యతో పాటు ఆయన స్నేహితుడు వెంకటేశ్వర్లు అదే ఇంట్లో ఉన్నారు. మంగళవారం ఉదయం చిన్నయ్య మృతి చెంది ఉండటాన్ని గమనించి పరుగున కింద ఫ్లోర్‌లో ఉన్న ఇంటి యజమాని మధుకు చిన్నయ్య మృతి చెంది ఉండటాన్ని చెప్పాడు. వెంకటేశ్వర్లు లుంగీ, బనియన్ ధరించి ఉండటంతో ఇంట్లో మీరు కూడా ఉన్నారు కదా!? అని ప్రశ్నించగా, తాను బెడ్‌రూంలో గాఢ నిద్రలో ఉన్నానని, ఉదయం లేచి చూసేసరికి చిన్నయ్య మృతి చెంది ఉన్నాడని చెప్పుకొచ్చాడు. హత్య జరిగిన ఇంటికి సమీపంలోనే వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఉండటంతో కింద ఇంట్లో నివాసం ఉంటున్న వారు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు.

● చిన్నయ్యకు పలువురితో విభేదాలు

మృతుడు చిన్నయ్య సొంతూరు సర్వరాబాదుతోపాటు ఉదయగిరిలోనూ పలువురితో విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆర్థిక లావాదేవీలు, భూవివాదాలు ఉన్నట్లు సమాచారం. అంతేగాక పలువురుపై పోలీసులకు ఫిర్యాదులు చేసి వారిని జైలుకు పంపారని తెలుస్తోంది. ఈ కారణా ల నేపథ్యంలోనే సుఫారీ ఇచ్చి ఎవరైనా హత్య చేయించి ఉంటారని కుటుంబసభ్యులు చర్చించుకుంటున్నారు. సోమవారం కొందరు వ్యక్తులు రియల్ ఎస్టేట్ గురించి చిన్నయ్యతో చాలా సేపు మాట్లాడి వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రాత్రి 11.40 గంటల ప్రాంతంలో కొందరు వ్యక్తులు అదే వీధిలో గాంధీనగర్ వైపు పరుగులు తీయ డం చూశామని కొందరు చర్చించుకుంటున్నారు. పలు కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హత్య జరిగిన ఇంటి ముందు గుమికూడిన జనం



మృతుడు చిన్నయ్య (ఫైల్)

నగరవాసుల్లో భయం.. భయం

ప్రశాంతతకు మారు పేరు అయిన నెల్లూరు నగరం హత్యలకు అడ్డాగా మారిపోయింది. రోజుల వ్యవధిలో జరుగుతున్న హత్యలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గత నెలలో ఒకేరోజు గంట వ్యవధిలో జరిగిన రెండు హత్యల గురించి నగరవాసులు మరువకముందే వేదాయపాలెం స్టేషన్ పరిధిలోని బుజబుజనెల్లూరు ప్రాంతంలో ఈ నెల 3వ తేదీన నడిరోడ్డుపై ఓ మహిళపై హత్యాయత్నం జరిగింది. చివరకు ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. తాజాగా ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి అదే స్టేషన్ పరిధిలో వెంకటరెడ్డినగర్ నాల్గవ వీధిలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఓ వ్యక్తిని కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేశారు. ఇలా నగరంలో రోజుల వ్యవధిలో వరుసగా జరుగుతన్న హత్యలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. జరుగుతున్న ఘాతుకాలపై సాక్షాత్తు డీజీపీ సీరియస్ అయినా జిల్లా యంత్రాంగంలో మాత్రం చలనం ఉండటం లేదు. మొక్కుబడిగా నాలుగు రోజులపాటు తనిఖీలపేరుతో హడావుడి చేసి వదిలేశారు. హత్య చేసిన నిందితులు గాంధీపురం వైపు పరుగులు తీశారు. ఆ సమయంలో పోలీసులు గస్తీ నిర్వహించి ఉండిఉంటే నిందితులు గుర్తించే అవకాశం ఉండేది.

కుటుంబం కోసం బతకండి

● పోలీసుల వీడ్కోలు సభలో ఎస్పీ కృష్ణకాంత్



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య తదితరులు

నెల్లూరు(క్రైం), మే 6 (ఆంధ్రజ్యోతి) : సమాజం కోసం దీర్ఘకాలంగా పోలీసులుగా సేవలందించారు, ఇక నుంచి జీవిత భాగాస్వామి, కుటుంబం కోసం సమయం కేటాయించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ సూచించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంగళ వారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సభ జరిగింది. ఎస్ఐ కే వెంకటాద్రి నాయుడు, ఏఎస్ఐ ఎస్‌కే ఖాదర్ వల్లి, హెచ్‌సీ టీ భాస్కర్, ఉమెన్ హెచ్‌సీ టీ దేవసేన, ఏఆర్ ఎస్ఐ ఎం శంకరయ్య, ఏఎస్ఐ వై వెంకటే శ్వర్లు, హెచ్‌సీ కే ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు యూనిఫామ్‌తో సర్వీస్ చేయడం గర్వకారణమన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎటువంటి అవసరమైనా తనను సంప్రదిం చవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏవో చంద్రమౌళి, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, హోంగార్డ్ ఆర్ఐ పౌల్‌రాజ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు శ్రీహరి, పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంగం బ్యారేజీలో ఆగమేఘాలపై గేట్ల నిర్వహణ

సంగం, మే 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా బ్యారేజీ నిర్వహణను మరిచిన అధికారులు మంగళవారం ఆగమేఘాలపై నీటిమట్టం తగ్గించి, నిర్వహణ పనులు చేపట్టారు. 2022 మేలో సంగం బ్యారేజీ పనులు పూర్తి కాకుండానే వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. అప్పటి నుంచి బ్యారేజీలో నీటిని నిల్వ చేసి, వివిధ కాలువలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి ఏటా వరికోతలు పూర్తయ్యాక వేసవిలో గేట్ల నిర్వహణ చేయాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్ల ఎలాంటి నిర్వహణ పనులు చేపట్టలేదు. ఇటీవలే ఖరీఫ్ సీజన్ పూర్తయింది. బుధవారం నుంచి రబీకి నీటిని విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ఆగమేఘాలపై బ్యారేజీ వద్ద నిల్వ చేసిన నీటిని ఇటు నెల్లూరు, అటు కనిగిరి రిజర్వాయర్ కాలువకు విడుదల చేశారు. నీటిమట్టాన్ని పూర్తిగా తగ్గించారు. ఈ నేపథ్యంలో గేట్ల నిర్వహణ పనులకు చేస్తున్నారు. ప్రస్తుతం గేట్ల రోప్‌లకు గ్రీస్ పెడుతున్నారు. మొత్తం 85 గేట్ల రోప్‌లకు గ్రీస్ పెట్టి గేట్ల నిర్వహణ ఎలా ఉన్నా యో..? సరిచూడాల్సిన అవసరం ఉంది. ఇకపోతే రెండు రోజుల్లో నిర్వహణ పనులు ఎలా పూర్తవుతాయో వేచి చూడాల్సిందే. అంతా మొక్కుబడి నిర్వహణేనని పలువురు రైతులు పెదవి ఇరుస్తున్నారు.

నేడు సోమశిలకు ఆనం రాక

అనంతసాగరం : సోమశిల ప్రాజెక్టును బుధవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించనున్నారు. ఐఏబీలో తీసుకున్న నిర్ణయం మేరకు డెల్టా, నాన్‌డెల్టాలో రెండో పంటకు నీరు విడుదల చేస్తారని మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.



బ్యారేజీ గేట్ల రోప్‌లకు గ్రీస్ వేస్తున్న కూలీ

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

మైనార్టీస్ కార్పొరేషన్ ఈడీ హైఫా

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025 - 26 సంవత్సరానికి మైనార్టీ లబ్ధిదారులకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేస్తామని జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ షేక్ హైఫా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలు తదితర మైనార్టీలు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాకు 1449 మంది లబ్ధిదారులకుగాను రూ.11.15కోట్ల సబ్సిడీతో రూ.22.31కోట్ల రుణ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. స్లాబ్-1 కింద యూనిట్ విలువ రూ.లక్ష అని, దీని కింద 1098 మందికి కేటాయింపులు ఉంటాయని తెలిపారు. స్లాబ్-2లో యూనిట్ విలువ రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు ఉంటుందని, దీని కింద 23 మంది లబ్ధిదారులకు కేటాయింపులు ఉంటాయన్నారు. స్లాబ్-3లో యూనిట్ విలువ రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ స్లాబ్ కింద 112 మంది లబ్ధిదారులు ఉంటారని తెలిపారు. స్లాబ్-4లో యూనిట్ విలువ రూ.8లక్షలని, దీని కింద 16 మందికి కేటాయింపులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నాలుగు స్లాబుల్లోనూ 50 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. 21-55 సంవత్సరాలలోపు వయసు కలిగిన మైనార్టీ అభ్యర్థులు apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నాన్‌బెయిలబుల్ కేసు పెట్టినట్లు పోలీసులు చెప్పలేదు

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి) : తనపై నాన్‌బెయిలబుల్ కేసు పెట్టినట్లు పోలీసులు సమాచారం ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని క్యాంప్ కార్యాలయంలో వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చరవాణి ద్వారా మాట్లాడారు. ఎప్పుడో మూసేసిన ఫైలాన్ కూల్చివేత కేసును రీ ఓపెన్ చేసి సంబంధంలేని తనతోపాటు కొందరు వైసీపీ నేతలు పాత్రికేయులపై నాన్ బెయిల్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. మీడియా ద్వారా కేసు విషయం తెలుసుకున్నానని డీఎస్పీ గాని ఎస్పీ గాని పిలిస్తే తప్పకుండా వస్తానన్నారు. కేసులకు భయపడనని చట్టంపై నమ్మకం గౌవరం ఉందని న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు గంధం ప్రసన్న, పందిటి కామరాజు, మద్దిబోయిన రఘు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కనమర్లపూడి నారాయణ, కుందుర్తి కామయ్య, గుడ్లూరు మాల్యాద్రి, కొమారి రాజు, జీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ఆకస్మిక తనిఖీ

సైదాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి):రామసాగరం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వీస్ నగదును ఎప్పటికపుడు చలానా రూపంలో చెల్లించాలని ఆదేశించారు. వివిధ సర్వేల ప్రగతిపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సకాలంలో సిబ్బంది సచివాలయానికి చేరుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్రటరీ విమల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9347
వెండి కిలో ధర	రూ. 98,600
వెండి ఒక గ్రాము	రూ.101.10

న్యూస్ బాక్స్

చిన్నారులకు యోగాపై శిక్షణ



నివాళులర్పిస్తున్న అరుణ్‌కుమార్

మనుబోలు, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక పాఠశాలలో వారంరోజులుగా వేసవివిజ్ఞాన శిబిరంను మనుబోలు గ్రంథాలయ అధికారి అరుణ్‌కుమార్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం యోగా గురువు శివానందబాబాకు నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు పతంజలి యువభారత్ జిల్లా ఇన్‌చార్జి, యోగా శిక్షకుడు కోటేశ్వర్‌రెడ్డి యోగా వ్యాయామాలు, ఆసనాలు గురించి తెలయజేసి వారితో చేయించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సౌమ్య, విజయ, నిర్మల పాల్గొన్నారు.

ఎంఎల్ హెచ్‌పీల అనుచిత వ్యాఖ్యలపై నిరసన




నిరసన వ్యక్తం పీహెచ్‌సీ క్షేత్ర సిబ్బంది

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి):ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే క్షేత్ర సిబ్బందిపై ఎంఎల్‌హెచ్‌పీలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం స్థానిక పీహెచ్‌సీ క్షేత్ర సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ఎంఎల్‌హెచ్‌పీలు సమ్మె చేయడం సముచితం కాదన్నారు. అలాగే ఏఎన్ఎంల పదో తరగతి అర్హత, సూపర్‌వైజర్‌లు, హెచ్‌ఈవోల జీతభత్యాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా తాము ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో శాస్త్రి, సీహెచ్‌ఎస్ ఉష, హెచ్‌ఎస్ కృష్ణంరాజు, హెచ్‌వీలు నిర్మల, ప్రమీల, ఆరోగ్య సహాయకులు బాలకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆరు పొట్టేళ్ల మృతి

కోవూరు, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పోతిరెడ్డిపాళెంలో మంగళవారం వీధి కుక్కలు దాడి చేయడంతో ఆరు పొట్టేళ్ల మృతి చెందాయి. పోతిరెడ్డిపాళెంలోనే రెండు రోజుల కిందట వీధికుక్కల దాడిలో 14 పొట్టేళ్ల మృతి చెందాయి. ఆరుపొట్టేళ్ల మృతితో యజమాని శ్రీనివాసులుకు రూ.60వేల ఆర్థిక నష్టం జరిగింది.

న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయాధికారిణి వాణి

కోవూరు, మే 6(ఆంధ్రజ్యోతి):స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలోని ఓ బ్రిక్స్ కంపెనీలోని కార్మికులకు మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయాధికారి వాణి మాట్లాడారు. సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరు 15100కు ఫోన్ చేయాలని కోరారు. అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకం అమలుకు ప్రత్యేక గుర్తింపు కార్డులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో లేబరు ఆఫీసర్లు అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

శ్రీరామనవమి వేడుకలు

తోటపల్లిగూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వెంకన్నపాలెం, మత్స్యకారపాలెం లోని మత్స్యకారులు శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులందరూ వేడుకల్లో పాల్గొని సీతారామ కల్యాణంతో పాటు గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో గ్రామ పెద్దకాపు పామంజి రామయ్య, కొండూరు వెంకటరమణయ్య, అక్కయ్య గారి ఆదెయ్య, పేటంగారి వెంకటేశ్వర్లు, ముత్యాల మహేష్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఫిర్యాదుల కేంద్రం ప్రారంభం

కోవూరు, మే6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ప్రత్యేక ఫిర్యాదుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తహసీల్దారు నిర్మలానందబాబా తెలిపారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు హాజరవుతారని చెప్పారు. రైతులు సమస్యలపై ఫిర్యాదు కేంద్రంలో వినతులు అందజేయాలని కోరారు.

స్థలాల కొనుగోలుదారులకు గుదిబండ!

- పెరిగిన ఫీజులు చెల్లించలేక అగ్రిమెంట్లతో సరి
- సాఫీగా సాగని రిజిస్ట్రేషన్లు

కోవూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నుంచి పెరిగిన రిజిస్ట్రేషన్ ఫీజులు కొనుగోలుదారుల పాలిట గుదిబండగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజును 7.5శాతంగా నిర్ణయించడంతో కోవూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయపరిధిలోని కోవూరు, కొడవలూరుచ విడవలూరు మండలాల్లోని కొనుగోలుదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కోవూరు మండలంలోని గ్రామాల్లో ఎకరా పొలం ధర రూ.12లక్షలు పలుకుతోంది. కొడవలూరు, విడవలూరు మండలంలోని గ్రామాల్లో ఎకరం ధర రూ.9లక్షల వరకు ఉంది. రూ.లక్షకు రూ.7500 చెల్లించాల్సి రావడంతో ఆందోళనల వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం యూజర్ చార్జీలు రూ.500 చెల్లించాల్సి వస్తోంది. ఎకరా పొలం కొనాలంటే రూ.72వేలు ప్రభుత్వానికి ఫీజుల రూపేణా చెల్లించాలి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాయంలో రూ.లక్షకు రూ.500విధిగా మామూలు చెల్లించుకుంటూనే భూమి రిజిస్ట్రేషన్ కార్యకలాపం యధావిధిగా కొనసాగుతుంది. రూ.లక్షకు రూ.500 చెల్లించకుంటే రిజిస్ట్రేషన్ చేయరు. అదనపు వసూళ్లను కొనుగోలుదారులకు మామూలు చేశారు.

రిజిస్ట్రేషన్ల ఫీజు పెంపు ప్రభావం లేదు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు యథావిధిగా జరుగుతున్నాయి. ఫీజు పెరిగినందు వల్ల రిజిస్ట్రేషన్లు తగ్గలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకే నడుచుకుంటున్నాం. ఎక్కువ నగదు వసూలు చేయడం లేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు కడితే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుంది. అదనంగా ఏమీ వసూలు చేయడం లేదు

- యూ.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, కోవూరు

● అదనపు సొమ్ముకు ధర పట్టీ..

కోవూరు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొన్ని రిజిస్ట్రేషన్లకు అదనపు సొమ్ము వసూళ్ల ధరల పట్టీని సిబ్బంది నిర్ణయించారు. ఆ వసూళ్ల ధరల పట్టీని అనుసరించే క్రయవిక్రయాల్ని సాగించాలి. సొమ్ము చెల్లించకుంటే ఏదో ఒక కొర్రీ వేసి రిజిస్ట్రేషన్ ఆపివేస్తారు. కొనుగోలుదారులు నగదు చెల్లించిన తరువాత రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. ఈ తంతు రాష్ట్ర, జిల్లా రిజిస్ట్రేషన్ల అధికారులకు తెలిసినా పట్టించుకోవం లేదని తెలిసింది.

● తగ్గిన రిజిస్ట్రేషన్లు

పెరిగిన రిజిస్ట్రేషన్ ధరలతో రిజిస్ట్రేషన్లు తగ్గినట్లు ప్రజలు భావిస్తున్నారు. గత ఫిబ్రవరి తరువాత రిజిస్ట్రేషన్లు తగ్గినట్లు తెలుస్తోంది. గిఫ్టు రిజిస్ట్రేషన్‌కు 2.5శాతం, దూరపు బంధువులకు గిఫ్టు



కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్‌కు 3.5 శాతంగా ప్రభుత్వం నిర్ణయించడంతో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. రిజిస్ట్రేషన్ల పెంపునకు రిజిస్ట్రేషన్ల శాఖ పలు మార్గదర్శకాల్ని ప్రవేశపెట్టినా కోవూరు సబ్ రిజిస్ట్రార్‌లో అమలుకు నోచుకోవడం లేదు.

● రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ నియామకం ఎప్పుడో..

కార్యాలయానికి చాలాకాలం నుంచి రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ లేరు. ఇన్‌చార్జిలతో కాలం నెట్టుకొస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ నియామకానికి రాష్ట్ర రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. సమస్యల పరిష్కారానికి రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి

- బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి
- కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, మే 6(ఆంధ్రజ్యోతి):మహిళలు స్వయం ఉపాధితో కుటుంబ ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి అన్నారు. మంగళవారం ఈడీ బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. వాటితో జాకెట్లు, ఫాల్స్‌లు తదితర కుట్టు పనులతో స్వయం ఉపాధి పొందాలన్నారు. ఈ సందర్భంగా కేంద్రం శిక్షణా నిర్వాహకులు పరికరాల రిపేర్లు, తలెత్తే పలు సమస్యలను ఈడీకి వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బుచ్చి పట్టణంల్లోని మహిళలకు మధ్యాహ్నం సమయంలో కుట్టు శిక్షణను ప్రారంభించాలని సూచించారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్‌తో మాట్లాడుతామని చెప్పారు.

ప్రతి విద్యార్థి యోగా అలవాటు చేసుకోవాలి

- లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే



వ్యాయమాలు చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

వెంకటాచలం, మే 6 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవన విధానంలో ప్రతి విద్యార్థి యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే సూచించారు. చవటపాళెంలోని ఎన్‌సీసీ శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు విచ్చేసి వ్యాయామం, యోగా, ధ్యానం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులతో యోగా, ధ్యానం, వ్యాయమాలు చేయించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్, సాయిశంకరి తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

ముత్తుకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 92 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సుబ్బారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల సమీపంలో తిన్నెలపూడి రత్నమ్మ నుంచి 49 క్వార్టర్లు, అలాగే బావితోపు గ్రామంలో తంబి సుబ్రహ్మణ్యం వద్ద 43 క్వార్టర్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం అమ్మితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చెట్లు ఏపుగా పెరిగేందుకు చర్యలు

- పీసీసీఎఫ్ డాక్టర్ చలపతిరావు



చెట్లను పరిశీలిస్తున్న చలపతిరావు

వెంకటాచలం, మే 6 (ఆంధ్రజ్యోతి): మొక్కలు ఏపుగా పెరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్ డాక్టర్ పీవీ చలపతిరావు సూచించారు. కసుమూరు సమీపంలో వీఎస్ఎస్ ఆధ్వర్యంలో అటవీశాఖ పెంచుతున్న ఎర్రచందనం, జామాయిల్ మొక్కలను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఏపుగా మొక్కలు పెరిగేందుకు చెట్ల మధ్య దుక్కి చేయాల్సి ఉందన్నారు. ముళ్లపొదలు దట్టంగా ఉన్నాయని, వాటిని తొలగిస్తే మొక్కలు ఏపుగా పెరుగుతాయని సూచించారు. ఆయన వెంట గుంటూరు సీసీఎఫ్ ఐకేవీ రాజు, జిల్లా అటవీ శాఖ అధికారి మహ బూబ్ బాషా, నెల్లూరు ఎఫ్ఆర్‌వో ఎస్ మాల్యాద్రి, ఆమంచర్ల ఎఫ్ఎస్‌వో ఎం శ్రీనివాసులు, వడ్లపూడి ఎఫ్‌బీవో షేక్ రఫీ ఉన్నారు.

గంగపట్నం చెరువులో చేపల మృత్యువాత



చెరువులో మరణించిన చేపపిల్లలు

ఇందుకూరుపేట,మే 6 (ఆంధ్రజ్యోతి):గంగపట్నం చెరువులోని చేపలు మరణించడంతో కొమరిక, నరసాపురం గ్రామాల గిరిజనులు లబోదిబో మంటున్నారు. సోమవారం రాత్రి రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి కెమికల్ వ్యర్థ జలాలను చెరువులోకి వదలడంతో చెరువులోని లక్ష మత్స్యసంపద మృత్యువాత పడినట్లు వాపోయారు. చెరువుని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మాకు ఈ చర్యలతో కుటుంబాలు జీవనం కష్టతరం అవుతుందన్నారు. రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్ కెమికల్‌తో కూడిన వ్యర్థ జలాలను గంగపట్నం కాలువలోకి వదలకుండా చూడాలని కోరుతున్నారు.

బాలిక భవిష్యత్తుకు 'కిశోరి వికాసం'



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య

రాపూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం అనే కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య పేర్కొన్నారు. మండలంలోని గండ్రుపల్లి ఎస్టీకాలనీలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాల్య వివాహలు, ఆరోగ్యం, బలవర్ధకమైన ఆహార ప్రాధాన్యత, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత శుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై ఆమె బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు అనిత, టీచర్లు సుమతమ్మ, కవిత, అంకమ్మ పాల్గొన్నారు.

బద్దెవోలులో..

● మనుబోలు (ఆంధ్రజ్యోతి):బద్దెవోలు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరబాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొని వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావ సమయం లో వచ్చే సమస్యలను ఎదుర్కోవడం గురించి అవగాహన కల్పించారు. ఆడపిల్లలు ప్రతిరోజు స్నానం చేయాలని, లేకుంటే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అలాగే విటమిన్ సీ, ఐరన్ లభించే పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. వీటికితోడు ఎక్కువగా నీటిని తాగాలన్నారు. అనంతరం వారితో కిశోరివికాసం పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దొరసానమ్మ, రాధ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

● వెంకటాచలం (ఆంధ్రజ్యోతి): గొలగమూడి ఎస్టీ కాలనీలో ఐసీడీఎస్ అధికారులు కిషోర బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల ఆరోగ్యం, పోషణ, పరిసరాల పరిశుభ్రత అంశాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు గీత, సునీత, శ్యామల తదితరులున్నారు.

వైసీపీ నిర్లక్ష్యంతో నష్టాల్లో ఆర్టీసీ : జోనల్ చైర్మన్



గ్యారేజీని తనిఖీ చేస్తున్న జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

రాపూరు, మే 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నేడు ఆర్టీసీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆర్టీసీ డిపోలోని గ్యారేజీని, బస్టాండ్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాపూరు డిపోలోని ప్రయాణి కులు, కార్మికుల సమస్యలను బోర్డు మీటింగులో చర్చిస్తామన్నారు. రాపూరు నుంచి శ్రీశైలం, చెన్నైలకు వీలైనం త్వరలోనే బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆర్టీసీ ఆస్తులను వైసీపీ ప్రభుత్వం కుదవ పెట్టి రుణాలను తీసుకోవడం ద్వారా సంస్థ అభివృద్ధి చెందలేదన్నారు.ఆయన వెంట డిపో మేనేజర్ అనిల్ కుమార్, కార్మిక నాయకుడు గాలి అంకబాబు, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

లేఅవుట్లపై నుడా బృందం పరిశీలన

మనుబోలు, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో మంగళవారం నుడాపరిధిలోని లేఅవుట్లను సీఆర్‌డీఏ జేడీడీ (జాయింట్ డిప్యూటీ డైరెక్టర్) కేవీ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో రెండు బృందాలు పరిశీలించాయి. తొలుతగా మనుబోలు, కాగితాలపూరు పంచాయతీల పరిధిలోని అధికార, అనధికార లేఅవుట్లను పరిశీలించారు. లేఅవుట్లలో రోడ్ల కొలతలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జేడీడీ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని లేఅవుట్లపై దృష్టి పెట్టిందన్నారు. చాలా లేఅవుట్లు నిబంధనలకనుగుణంగా అనుమతులు తీసుకోకుండా వేసి, జనాలకు అమ్మేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లేఅవుట్ల నిబంధనలను సడలింపుపై తొలుత జిల్లాలో లేఅవుట్ల పరిశీలన చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. మండలంలో 31 లేఅవుట్లు ఉన్నాయని అందులో 10లేఅవుట్లు పరిశీలించామన్నారు. నుడా పరిధిలోని అన్ని లేఅవుట్లలో పరిశీలనలు చేసి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మనుబోలు కార్యదర్శి గరుడయ్య పాల్గొన్నారు.

పెనుబల్లి తిప్పలో గ్రావెల్ తవ్వకాలు

- ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం, మే6(ఆంధ్రజ్యోతి):పెనుబల్లి అరుంధతీవాడ సమీపంలోని తిప్పలో మంగళవారం గ్రావెల్‌ను తవ్వి తరలించారు. ఈ మేరకు పలువురు స్థానికుల ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు తిప్పవద్దకు చేరుకుని గ్రావెల్ తరలించే ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని బుచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిదశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

- కలెక్టర్ ఆనంద్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం, మే 6 (ఆంధ్రజ్యోతి):విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవడం ఎన్‌సీసీ తోనే సాధ్యమని, అలాగే సేవాభావం పెరుగుతుందని కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. మండలంలోని చవటపాళెంలోని అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిబిరాన్ని మంగళవారం రాత్రి సందర్శించారు. శిక్షణ పొందిన ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, సిబ్బందితో కలిసి భోజనం చేశారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి నిబద్ధతతో కూడిన శిక్షణ సాధ్యపడుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఎతిరాజ్, ఎన్‌సీసీ అధికారులు నరేంద్రబాబు, మల్లికార్జున్ రెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

జొన్నవాడలో భారీ చోరీ

- 22సవర్ల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, అర కేజీ వెండి అపహరణ
- వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీం



చెల్లాచెదురుగా పడేసిన బంగారు ఆభరణాల బాక్సులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలోని స్థానిక నీళ్ల ట్యాంకు సమీపంలోని వల్లం సుప్రజ అనే మహిళ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కుటుంబసభ్యులందరూ బయట పంచలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 22సవర్ల బంగారు నగలు, అరకేజీ వెండి వస్తువులు, రూ.లక్ష నగదు తీసుకెళ్లారు. చోరీ అనంతరం ఇంటి తలుపులు ముందుకేసి తాళం తలుపులకే పెట్టివెళ్లారు. ఈ విషయం ఇంట్లోని వారు ఉదయం నిద్రలేచి తలుపులు తీసి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బీరువా లో బట్టలు, బంగారు ఆభరణాలు పెట్టుకునే బాక్సులు ఇంట్లో, మంచం పైన చెల్లాచెదురుగా పడేసి వుండటాన్ని గమనించి బీరువాలో చూసి ఖంగుతిన్నారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి సిబ్బందితో చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్‌టీంతో బీరువా, తలుపులు, పలు చోట్ల వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రతిరోజూ బాధిత మహిళ సుప్రజ ఆమె కొడుకు పెంచలభార్గవ్‌తో పంచలో మంచం వేసుకుని నిద్రిస్తారు. తల దిండు కింద తాళం పెట్టుకుంటారు. వేకువజామున 5గంటలకే నిద్రలేచే కొడుకు.. 6లోపులేచే తల్లీ మంగళవారం ఉదయం 8 గంటలైనా నిద్ర మత్తు వదల్లేదు. ఆ తరువాత లేచి చూసేసరికి ఇంటి తాళం తీసి ఉన్నందున ఆ ఇద్దరిలో ఎవరో ఒకరు తీసివుంటారనే ఆలోచనతో ఉన్నారు. బంగారు, నగదు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో గుండెలు బాదుకుని విలపించారు. రూ.15లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ అవడంతో ఆ కుటుంబం వీధిన పడినట్లైంది.

ఎలుకల మందు తిని గిరిజనుడి మృతి

- నేత్రదానం చేసిన కుటుంబసభ్యులు

మనుబోలు, మే 6 (ఆంధ్ర జ్యోతి): ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఈ ఘటన మండలంలోని కొలనుకుదురు గిరిజన కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఈగ చినరాయుడు (25) నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం వేకువజామున మృతిచెందాడు. ఈయనకు భార్య, రెండునెలల పాప ఉన్నది. కుటుంబంలో కొద్ది రోజులుగా చిన్నపాటి తగాదాలు ఉండటంతో మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు.

నేత్రదానం..

నేత్రదానం చేయడం చాలా గొప్పదని చినరాయుడు కుటుంబసభ్యులకు గ్రామ టీడీపీ నాయకులు కసిరెడ్డి సునీల్‌రెడ్డి సూచించడంతో చినరాయుడు నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. దీంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాల ఐ బ్యాంకు టెక్నీషియన్ సునీల్ వచ్చి నేత్రాలను సేకరించారు. అనంతరం చిన్నరాయుడు కుటుంబసభ్యులకు ఐబ్యాంకు తరపున ధ్రువీకరణపత్రం అందజేశారు. శవపరీక్షల అనంతరం చినరాయుడు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మీ హెచ్చరిక.. మాకో లెక్కా?

- యథేచ్ఛగా కలప నరికి అక్రమంగా తరలింపు



అక్రమంగా నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న కలప

దుత్తలూరు (ఉదయగిరి), మే 6 (ఆంధ్రజ్యోతి): అధికారుల హెచ్చరిక.. మాకో లెక్కా... ? అంటూ అక్రమార్కులు బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో కలప తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల మేరకు.. మండలంలోని భైరవరం పంచాయతీలో ఆరెకరాల ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా కలప నరికి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని సోమవారం గ్రామస్థులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆర్ఐ, వీఆర్వో సంఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో కలప నరికి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే అక్రమార్జనకు అలవాటుపడ్డ అక్రమారులు వారి హెచ్చరికలను బేఖాతరు చేస్తూ మంగళవారం కూడా యథేచ్ఛగా కలప నరికి వాహనాల్లో తరలించారు. అయితే అక్రమంగా కలప నరికివేతలో అధికారులు అక్రమార్కులకే వంతపాడుతున్నార ని, వారి అక్రమార్జనలో వారికి వాటాలున్నాయని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు నాగరాజును వివరణ కోరగా కలప నరికివేస్తున్నారని మంగళవారం సైతం తన దృష్టికి రావడంతో సిబ్బంది పంపి అక్రమార్కులను గట్టిగా హెచ్చరించామన్నారు. సిబ్బందిని అక్కడే కాపలాగా ఉంచామన్నారు. మరోసారి ఇలానే చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

బైక్ నుంచి పడి ఒకరికి గాయాలు



బైక్ నుంచి కిందపడి గాయపడ్డ కల్లూరి పెద్ద వెంకట సుబ్బారెడ్డి

సీతారామపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రంగనాయుడుపల్లి గ్రామానికి చెందిన కల్లూరి పెద్ద వెంకట సుబ్బారెడ్డి తన బైక్‌పై రంగనాయుడుపల్లి నుంచి సీతారామపురం గ్రామానికి వస్తున్నాడు. అయ్యవారిపల్లి గ్రామ సమీపంలోని నేషనల్ హైవేపై ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి పక్కనే వస్తున్న మరో బైక్‌ని ఢీ కొట్టడంతో కిందపడ్డారు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు 108 ద్వారా ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 500



పౌర సేవలు జాగ్రత్తగా అందించండి : జేసీ

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రభుత్వం అనునిత్యం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నందున అత్యంత జాగ్రత్తగా పౌరసేవలు అందించాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ సూచించారు. మంగళవారం తిక్కన భవన్‌లో రీసర్వే, డిజిటలైజేషన్, సిటిజన్ సర్వీసెస్ తదితర రెవె న్యూ సంబంధిత విషయాలపై ఆత్మకూరు డివిజన్ తహసీల్దార్లతో ఆయన సమీక్ష జరిపారు. పలు సూచనలు చేశారు. రైతుల నుంచి నీటి తీరువా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీవో పావని, సర్వే ఏడీ నాగశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌తో రూప్‌కుమార్ భేటీ

నెల్లూరు(సిటీ), మే 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి లోని లోకేష్ నివాసంలో కలిశారు. నగరానికి సంబంధించిన తాజా రాజకీయ పరిణామాలు, కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు వారి మధ్య చర్చకొచ్చినట్లు సమాచారం.

నవాబుపేట ఇన్‌స్పెక్టర్‌గా వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో నగరంలోని బాలాజీనగర్, ఆత్మకూరు స్టేషన్లలో సీఐగా విధులు నిర్వహించారు. నవాబుపేటలో బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

● కలెక్టర్‌కు ఎన్జీవోల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్జీవో సంఘం నాయకులు

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు నగరంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టర్ ఆనంద్‌ను ఎన్జీవో సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను చాంబర్‌లో కలిసి విన్నవించారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ జీజీవోఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి చినఅంకయ్య, జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్ నందిమండలం ఆంజనేయ వర్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), మే 6,(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ విరమణ వయసు పెంచడంతోపాటు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళన మంగళవారం రెండో రోజు కొనసాగించారు. కార్మిక సంఘం, సీపీఎం నాయకులు మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్‌ను కలిశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాశీవిశ్వనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో జీ దర్గయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, గురువారం ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 8గంటలకు శేషవాహన సేవ జరుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని ఆయన కోరారు.

నేడు బ్రహ్మంగారి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విరాట్ నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం బ్రహ్మంగారి 332వ వార్షిక ఆరాధన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం శాశ్వత అధ్యక్షుడు కందుకూరి చెంగయ్య ఆచారి తెలిపారు. బుధవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అభిషేకాలు, పూలంగిసేవ, అన్నప్రసాద వితరణ జరుగుతాయన్నా రు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సహస్ర దీపాలంకరణ జరుగుతాయని, భక్తులు తరలిరావాలని కోరారు.

నేత్రపర్వం పార్వతీ పరిణయం

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం మూలస్థానేశ్వర స్వామికి, భువనేశ్వరీ అమ్మవార్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, పార్వతీ పరిణయం అలంకారంలో స్వామివారి వనంలో ప్రాకారం ఉత్సవం జరిగింది.

నేటి నుంచి ఆదిశంకర స్మరణోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొగతోట ఆదిశంకర నిలయంలో బుధవారం నుంచి 13వతేదీ వరకు ఆదిశంకరాచార్యుల సంస్మరణ మహోత్సవాలు జరుగుతాయని చక్రాలు వారి ట్రస్ట్ ఓ ప్రకటనలో తెలిపింది. గంభీరానంద భారతీ మహా స్వామిచే ఉపనిషత్ భాష్య ప్రవచనాలు ఉదయం జరుగుతాయని, రాత్రి 7గంటల నుంచి సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని భక్తులందరూ తరలిరావాలని కోరింది.

హైవే ఆక్రమణలు



చింతారెడ్డిపాలెం హైవే పక్కన వెలసిన హోటళ్లు

● అనధికారకంగా హోటళ్లు, దుకాణాల ఏర్పాటు
● ఎక్కడపడితే అక్కడే వాహనాల పార్కింగ్
● భద్రత గాలికి.. తరచూ రోడ్డు ప్రమాదాలు
● నిర్వహణను పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్లు

నెల్లూరు (జడ్పీ), మే 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పరిధిలోని జాతీయరహదారి(హైవే) ఆక్రమణదారుల చెరలో చిక్కింది. హైవే నిర్వహణను, నిబంధనలను అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవడంతో కొన్నిచోట్ల కాలువ గట్టులాగా, మరికొన్ని చోట్ల చిన్న రహదారిలా మిగిలింది. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చే నిబంధనలు ఉండగా, నగరం నడిబొడ్డు నుంచి వెళుతున్న హైవేలో మాత్రం నిబంధనలను గాలికి వదిలేశారు. జాతీయరహదారి స్థలాన్ని ఆక్రమించడం కాని, అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం నిబంధనలకు పూర్తి విరుద్ధం. అయితే నగరంలోని ఎన్టీఆర్ నగర్ పెట్రోలు బంకు ప్రాంతం నుంచి అయప్పగుడి వరకు ఉన్న జాతీయ రహదారిని ఎవరిష్టం వచ్చినట్లుగా వారు ఆక్రమించుకున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, జాతీయ రహదారి అధికారులుకానీ, కాంట్రాక్టరుకానీ పట్టించుకున్న పాపాన పోలేదు.

● హైవేపై అంతా ఆక్రమణలే....

జాతీయరహదారితోపాటు భవిష్యత్తులో రోడ్డు విస్తరణ కోసం సేకరించిన స్థలం వరకు గతంలో హైవే అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడపడితే అక్కడ రోడ్డుపైకి వచ్చే అవకాశం లేకుండా ఉండేది. క్రమేపీ ఫెన్సింగ్‌ను తొలగించకుంటూ స్థానికులు హైవేపై దుకాణాలను తీసుకువచ్చేశారు. ప్రధానంగా చిల్డ్రన్‌పార్కు ప్రాంతం నుంచి ఎన్టీఆర్ నగర్ పెట్రోలు బంకు వరకు మద్యం షాపులు, రెస్టారెంట్లు, చిన్నచిన్న దుకాణాలు, పండ్ల అంగళ్లు, టిఫిన్ దుకాణాలన్నీ రోడ్డుపై ఏర్పాటు చేసుకుని స్థలాలను అనధికారికంగా ఆక్రమించుకున్నారు. దీంతో కొనుగోలుదారులు వాహనాలను జాతీయరహదారిపైనే నిలిపి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన కర్బూజ దుకాణాలు

● నిబంధనలు గాలికి...

జాతీయరహదారిపై వాహనాలు నిలుపుకునేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. మిగతాచోట్ల ఎక్కడా వాహనాలను నిలపకూడదు. ఎక్స్‌ప్రెస్ హైవేలు కావడంతో ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు కూడా ఉండవు, దీంతో ప్రమాదాలకు అవకాశం లేకుండా హైవే అథారిటీ కఠిన నిబంధనలు విధించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రతి సెక్షన్‌కు సెక్యూరిటీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అయితే నగరంలోని హైవేపై భద్రతను అధికారులు పూర్తిగా వదిలేశారు. రోడ్లపై వచ్చే లారీలు, ట్యాంకర్లు, ఇతర భారీ వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తున్నారు. అరికట్టాల్సిన హైవే సెక్యూరిటీ విభాగం ఎక్కడా కనిపించడం లేదు. అలాగే రోడ్డు నిర్వహణకు కాంట్రాక్టర్‌కు రూ. కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నా, రోడ్ల నిర్వహణ, పచ్చదనం, రోడ్డు శుభ్రతను వారు పూర్తిగా పట్టించు కోవడం మానేశారు. నగర పాలకులు కూడా పట్టించుకోక పోతుండడంతో అధికారులు, కాంట్రాక్టర్లు నిధులు తినేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైవేపై అక్రమంగా తాత్కా లిక లింకురోడ్లు వేస్తున్నా, వారిపై చర్యలు తీసు కోవాల్సిన అధికారులు వారివద్ద ముడుపులు తీసుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పం దించి జాతీయరహదారిపై ఆక్రమణలను అరికట్ట డంతోపాటు, ప్రమాదాలను నివారించాల్సి ఉంది.



డ్రోన్ కెమెరాలతో రైల్వే పోలీసుల తనిఖీలు

రైల్వే ట్రాక్‌ను డ్రోన్ కెమెరాలతో తనిఖీ చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్తుల భద్రత, నేరాలను అరికట్టేందుకు రైల్వే ఎస్పీ ఆదేశాలతో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్, పడుగుపాడు, వేదాయపాళెం స్టేషన్లలో మంగళవారం డ్రోన్ కెమెరా లతో తనిఖీలు చేశారు. రైల్వే సీఐ సుధాకర్, ఎస్ఐలు హరి చందన, మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యానాదుల ఉన్నతికి కృషి చేయండి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : సామాజికంగా వెనుకబడ్డ యానాదుల జీవన ప్రమాణాల మెరుగు కోసం అధికారులు కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. విజయవాడలోని వెన్నెలకంటి రాఘవయ్య సమావేశ మందిరంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న 10వ గవర్నింగ్ బాడీ సమావేశంలో సభ్యురాలి హోదాలో ఆమె పాల్గొన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కోవూరు నియోజకవర్గంలో యానాదులు ఎదుర్కొంటున్న దయనీ య పరిస్థితులను వివరించారు. ధర్తిజన్ జాతీయ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ-జేజీ యూఏ) స్కీమ్‌ను ఆ నియోజకవర్గంలో అమలు చేయాలని కోరారు. గిరిజన పిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి స్థల సేకరణకు కొడవలూరు, ఇందుకూరు పేట మండల తహసీల్దార్లను ఆదేశించినట్లు చెప్పారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకాన్ని ఎస్టీ జనాభా అధికంగా ఉన్న గ్రామాలకు వర్తింపజేయాలని విన్నవించారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి



బిందెలతో మంచినీటి కోసం నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం శ్రేణులు

నెల్లూరు (వైద్యం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 23, 24 డివిజ న్లలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీపీఎం వినూత్న రీతిలో ఆందోళన చేపట్టింది. స్థానిక సచివాయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపింది. అనంతరం సచివాలయం అధికారులకు నాయకులు వినతిపత్రం అందించారు. ప్రస్తుత వేసవి కాలంలో ఆయా డివిజన్లలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండ ప్రసాద్, నాయకులు సురేష్, వీర్ల శ్రీనివాసులు, సుబ్బారావు, మల్లికార్జున, వెంకమ్మ, హబీబ్ తదితరులు పాల్గొన్నారు,

డివిజన్లలో సమస్యలు పరిష్కరించండి

● మేయర్, కమిషనర్‌కు కార్పొరేటర్ల విజ్ఞప్తి



అధికారులతో సమీక్షిస్తున్న మేయర్, కమిషనర్లు

నెల్లూరు(సిటీ), మే 6 (ఆంధ్రజ్యోతి) : తమ డివిజన్లలో ప్రజా సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలం టూ కార్పొరేటర్లు నగర మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్, కమిషనర్ సమీక్ష జరిపారు. కొందరు కార్పొరేటర్లు మాట్లాడుతూ తమ డివిజన్లలో పారిశుధ్య నిర్వహణ, ఆక్రమణలు, సచివాలయాల్లో సిబ్బంది కొరత, వీధిలైట్లు, తాగునీటి సరఫరాలో లోపాలు వంటి సమస్యలు వెంటాడుతు న్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించే దిశగా ఉన్నతాధికారులు శ్రద్ధ వహించాలని కోరారు. అన్నింటినీ పరిష్కరిస్తామని మేయర్, కమిషనర్ హామీ ఇచ్చారు. కాగా, కమిషనర్ నందన్ బోడిగాడి తోటలోని పాత డంపింగ్ యార్డు వద్ద కేంద్ర ప్రభుత్వానికి చెందిన నమస్తే పథకం ద్వారా చెత్త వృత్తిదారులకు ప్రయోజనాలపై సమావేశం నిర్వహించారు.

తీవ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



ఉగ్రవాద దిష్టిబొమ్మతో బీజేపీ శ్రేణులు

నెల్లూరు(క్రైం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోటమిట్ట మహలక్ష్మమ్మ గుడి ప్రాంతంలో పాకిస్తాన్ తీవ్రవాదుల దిష్టిబొమ్మను మంగళవారం బీజేపీ నాయకులు దహనం చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ మాట్లాడుతూ పాకిస్తాన్ తీవ్రవాదులు కన్పిస్తే భారతీయులు దహనం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హేమంత్, పెంచలయ్య, లాల్ ఖాజా మస్తాన్, సుందరం, శ్రీనివాసులు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వద్ద చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కూ రగాయల మార్కెట్ వద్ద సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప మంగళవారం ప్రారంభించారు. విజయ డెయిరీ సహకారంతో ఈ చలివేంద్రాన్ని ఏ ర్పాటు చేశారు. కార్యక్రమంలో కో టేశ్వరరావు, ముని ప్రసాద్, ర సూల్ ఖాన్, పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించిన సహకార శాఖ అధికారి గురప్ప

మిత్రమండలి ఆధ్వర్యంలో..

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ఏసీ కూరగాయల మార్కెట్ మిత్ర మండలి ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తల్లి కోటంరెడ్డి సరళమ్మ జ్ఞాపకార్థం మార్కెట్ సెంటర్లో మజ్జిగ చలివేం ద్రం మంగళవారం ప్రారంభమైంది. దీనిని మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, దాట్ల చక్రవర్తి, మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని రామ్ లక్ష్మణ్, అజీజ్ తదితరులు పర్యవేక్షించారు.

30వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన

నెల్లూరు (సాంస్కృతికం) మే 6 (ఆంధ్రజ్యోతి) : నగర కమిషనర్ నందన్ మంగళవారం ఉదయం 30వ డివిజన్‌లో సుడిగాలి పర్యటన చేశారు. వడ్డిపాలెం, హెచ్‌కే బాబునగర్, రామకోటయ్య నగర్, నక్కాగోపాల్‌నగర్, తదితర ప్రాంతాలను సందర్శించారు. డ్రైనేజీ, తాగునీరు సమస్యలతోపాటు ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆరా తీశారు. హెచ్‌కే బాబు నగర్‌లో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవనాధారం కల్పించండి

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : మా భూములను తిరిగి ఇప్పించి తమకు జీవనాధారం కల్పించాలని ఆమంచర్ల గ్రామానికి చెందిన 150 ఎస్సీ కుటుంబాలు ఉన్నతాధికారులుకు విజ్ఞప్తి చేశాయి. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఎం నీరజతోపాటు ఎస్సీ కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడారు. 1979లో ఇందిరాగాంధీ హయాంలో రైతు కూలీలమైన తమకు అటవీ భూమిని పంచి ఇచ్చారన్నారు. తాము ఎంతో శ్రమించి ఆ భూమిని వ్యవసాయ భూమిగా మలుచుకొని వర్షాధార పంటలు పండించుకుంటూ జీవించేవారమన్నారు. 2015లో ఆర్డీవో, ఎంఆర్వో, వీఆర్వోలు ఆ భూమిలో ఫ్యాక్టరీలు కడుతామని చెప్పి స్వాధీనం చేసుకుని ఇంటికి ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పారని, భూమికి కొంత పరిహారం చెల్లించారని తెలిపారు. 10 సంవత్సరాలైనా తమకు అధికారులు ఉద్యోగులు కల్పించలేదని వాపోయారు.

ఆస్తమాపై అవగాహన

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రజాసైన్స్ వేదిక నెల్లూరు నగర అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్ ఆస్తమా వ్యాధి, చిన్నపిల్లల్లో ఆస్తమా వ్యాధిని గుర్తించడం, నివారణకు ముందు జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం పుస్తక పఠనం, యోగా ప్రాణాయామం నేర్పించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, సిబ్బంది కృష్ణయ్య, గిరిజ, జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

12న సామూహిక సత్యనారాయణ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహాత్మాగాంధీ నగర్ వేణుగోపాల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 12న సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు ఆలయం వద్ద సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్రంథాలయాన్ని పూర్తి చేయాలి

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని భారత సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసిం మంగళవారం ఎమ్మెల్సీ బీద రవిచంద్రను కోరారు. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావుల నుంచి నిధులు సేకరించి గ్రంథాలయ భవన నిర్మాణాన్ని అనతికాలంలోనే పూర్తి చేస్తామని రవిచంద్ర హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొమ్మల కృష్ణయ్య, ఇన్‌చార్జి జనార్దన్, కమిటీ సభ్యుడు గ్రంథం అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణలో ఆహార భద్రత ముఖ్యం

● నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి



వర్క్‌షాపులో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, వైద్యులు, అధికారులు

నెల్లూరు (వైద్యం), మే 6 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ వ్యాధి నివార ణలో ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందని నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆదేశాలతో నారాయణ వైద్య కళాశాలలో కేన్సర్‌పై నర్సింగ్ విద్యార్థులు, సిబ్బందికి వర్క్‌షాపు జరిగింది. కేన్సర్ నివారణ - కోలుకునే ప్రక్రియలో పోషకాహారం, ఆహార భద్రత అనే అంశంపై అవగాహన కల్పించారు. కూరగాయలు, పండ్లు, చిక్కుళ్లు, తృణధాన్యాలు ఆహారంలో తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఐసీఎంఆర్ నిధులు పొందిన నారాయణ నర్సింగ్ కళాశాల రెండవదని, ఇది గర్వకారణమని వెల్లడించారు. నారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో వైద్య కళాశాల కో ఆర్డినేటర్ డాక్టర్ బీజు రవీంద్రన్, ఆపరేషన్స్ హెడ్ రామారావు, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఉషారాణి, పోషకశాస్త్ర నిపుణులు మాగంటి పద్మజ మదన్, డైటీషియన్ విభాగాధిపతి డాక్టర్ గురుసాయి రత్నప్రియ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో చేరిక



వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 6,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గం 18వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు షేక్ రియాజ్ బాషా, షేక్ ఖాసీంబాషా మంగళ వారం రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసు లురెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

లార్వా దశలోనే దోమలను నివారించాలి

● మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఎంవో నాగార్జునరావు

నెల్లూరు (వైద్యం), మే 6 (ఆంధ్రజ్యోతి) : లార్వా దశలోనే దోమల నివారణ చర్యలు చేపట్టాలని మలేరియా నివారణ విభాగం అదనపు జిల్లా అధికారి నాగార్జునరావు వైద్య సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం చంద్రమౌళి నగర పట్టణ ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. రక్తపూతల సేకరణపై ఆరా తీశారు. ఇళ్లలో రోజుల తరబడి నీటి నిల్వలు ఉంటే వాటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శాంసన్, సీవో వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా 'సంఘం శరణం గచ్ఛామి'


నెల్లూరు (సాంస్కృతికం), మే 6 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి చక్కటి సందేశాన్ని అందిస్తూ సంఘం శరణం గచ్ఛామి పేరుతో ప్రదర్శించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టౌనుహాలులో ఈ నాటక ప్రదర్శన జరిగింది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించింది.

చిన్నయ్య హత్యతో ఉలిక్కిపడ్డ ఉదయగిరి

ఉదయగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాబాదు ఎస్సీ కాలనీకి చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్న మంగళవారం నెల్లూరులో హత్యకు గురయ్యాడు. దీంతో ఉదయగిరి ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఏ నలుగురు కలిసినా అతని హత్యపై చర్చించుకోవడం కనిపించింది. చిన్నయ్య పలువురికి సుపరిచితుడు. సీతారామపురం మండలం బసినేనిపల్లి పశు వైద్యశాలలో కాంట్రాక్టు పద్ధతిన అటెండర్‌గా పనిచేస్తున్నాడు. నెల్లూరులో కాపురం ఉంటున్న అతను కొన్ని నెలల క్రితం ఉదయగిరికి మకాం మార్చాడు. ఆర్థిక లావాదేవీలు, భూవ్యవహారాలు, ఇతరత్రా కారణాల వల్ల చిన్నయ్య హత్యకు గురై ఉంటాడని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 7 మే 2025


మంగళంపాడులో ఆత్రేయ జన్మించిన ఇల్లు



నేడు ఆచార్య ఆత్రేయ జయంతి!

మనసు కవి పుట్టింది ఇక్కడే!


కుటుంబ సభ్యులతో ఆత్రేయ

ఆచార్య ఆత్రేయ పుట్టిన ఇల్లు ఇది. సూళ్లూరుపేట సమీపంలోని మంగళంపాడులో ఇప్పటికీ ఈ పాత మిద్దె ఆయన పాటవలే చెక్కుచెదరకుండా ఉంది. 1915లో ఈ ఇల్లు నిర్మించారు. ప్రస్తుతం ఆయన కుటుంబానికి చెందినవారు ఎవరూ ఈ గ్రామంలో లేరు. ఆత్రేయ అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. 1921, మే 7న తన అమ్మమ్మగారి ఊరైన మంగళంపాడులో పుట్టారు. ఆత్రేయ తండ్రి వెంకట కృష్ణామాచార్యులు స్వగ్రామం ఉచ్చూరు. తల్లి సీతమ్మది మంగళంపాడు. తండ్రి ఉచ్చూరు జమీన్‌గా కూడా వ్యవహరించారు. తల్లి సీతమ్మ కాన్పుకోసం మంగళంపాడుకు వచ్చింది. ఆత్రేయ అక్కడే పుట్టడంతో నా జన్మస్థలం మంగళంపాడు అని అందరితో చెప్పేవారు. తన 8వ ఏటనే తల్లి మరణించడంతో మంగళంపాడులో మేనమామ వద్ద పెరిగారు. చిన్నప్పటి నుంచీ నాటకాలమీద మోజు ఎక్కువ. ఉచ్చూరులో వీధినాటకాలు వేసేవారు. నాటకాల నేపథ్యం నుంచే 1951లో దీక్ష సినిమాతో సినీరంగ ప్రవేశం చేశారు. 1400కి పైగా సినిమా పాటలు రాశారు. 400 సినిమాలకు మాటలు రాశారు. నిర్మాతగా మారారు. దర్శకత్వం వహించారు. 1961లో అక్కినేని నాగేశ్వరావు నటించిన వాగ్దానం సినిమాకు ఆత్రేయ దర్శకత్వం వహించారు. అన్నమయ్య సినిమా తీయాలని ఆయన కోరిక. ఇందుకోసం తిరుపతిలో పలు ప్రాంతాలను కూడా సందర్శించారు. ఆ కోరిక నెరవేరకుండానే 1989 సెప్టెంబరు 13న ఆత్రేయ మృతి చెందారు. చివరి రోజుల్లో మంగళంపాడులోనే స్థిరపడతానని చెప్పేవారు. ఆయన స్మారకంగా ఆ గ్రామంలోని గిరిజన కాలనీకి ఆత్రేయ కాలనీ అని పేరు పెట్టారు. సూళ్లూరుపేటలోనూ ఆత్రేయ పేరుతో ఒక వీధి ఉంది.

సినీరంగ ప్రవేశం తర్వాతనే కిళాంబి వెంకట నరసింహాచార్యులు ఆత్రేయగా మారారు. పేరుచివరిలోని ఆచార్యనీ, తన గోత్రం అయిన ఆత్రేయనూ కలిపి ఆచార్య ఆత్రేయ అని తనే పేరు పెట్టుకున్నారాయన. ఆత్రేయకు జనం పెట్టిన పేరు మాత్రం మనసు కవి. ఆత్రేయను గొప్ప వేదాంతిగా పేర్కొంటారు. మనసు సంబంధమైన పాటలే ఎక్కువగా రాయడంతో మనసుకవిగా ప్రసిద్ధుడయ్యారు. ఆత్రేయ గొప్ప నాటకాలు రాశారు. సినిమాకన్నా నాటకం మీద ఆయనకు మక్కువ ఎక్కువ అని స్నేహితులు చెబుతారు. ఆత్రేయ స్మారకంగా సూళ్లూరుపేట పట్టణంలో ఆడిటోరియం నిర్మించాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నారు. నాయకులు పూనుకుంటే ఇదేమంత పెద్ద విషయం కాదు.


మంగళంపాడులో ఆత్రేయ కాలనీ

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

నేడు సత్యవేడుకు లోకేశ్



సత్యవేడు, మే 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ బుధ, గురువారాల్లో సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 3.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని రోడ్డు మార్గాన 5.10కి సత్యవేడుకు వస్తారు. వీఎంకే కల్యాణ మండపం ఎదురుగా ఏర్పాటు చేసిన శిబిరంలో జరిగే టీడీపీ సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. పార్టీ చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ, సభ్యత్వ నమోదు తదితర కార్యక్రమాల్లో ముందు వరుసలో నిలిచిన కార్యకర్తలను సన్మానించనున్నారు. 6.30 నుంచి 8 గంటల వరకు నియోజకవర్గ నాయకులతో సమావేశమవుతారు. రాత్రి ఇక్కడే బస చేసి.. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహించి, వినతులు స్వీకరించనున్నట్లు తెలిసింది. అనంతరం రోడ్డు మార్గాన 11 గంటలకు శ్రీసిటీకి చేరుకుని ఎల్‌జీ పరిశ్రమ భూమి పూజలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గాన 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్‌కు వెళతారు.

'సత్యవేడు' కొలిక్కి వస్తుందా? 6





భక్తుల సమక్షంలో విశ్వరూప స్థూపానికి వడిబాల కడుతూ.. - వజ్రకిరీటంలో మెరిసిపోతున్న గంగమ్మ

● విశ్వరూప స్థూపానికి విశేషాభిషేకం ● తిరుపతి జాతరకు చాటు వేసిన కైకాలవాళ్లు

తిరుపతి, మే6(ఆంధ్రజ్యోతి): గంగమ్మ వడిబాల కట్టుకుంది. దీంతో జాతర సంబరాలకు, వేషాల సందడికి తిరుపతి సిద్ధమైంది. మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి పరిమళ, పవిత్ర జలాలతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. పసుపు, కుంకుమ, నారికేళ, పాలు, పంచామృతం వంటి సుగంధద్రవ్యాలతో అమ్మవారి స్థూపానికి జరిగిన అభిషేకాన్ని వీక్షించిన భక్తజనం పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను సైతం అభిషేకించి, వజ్రకిరీటధారణతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల దంపతులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఆలయ ఇఒ జయకుమార్, కూటమి నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, కొట్టే హేమంత్ రాయల్, రాజారెడ్డి, బాబ్జి, మన్నెం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అవిలాల నుంచి ఐదు ఆలయాలకు సారె

తాతయ్యగుంట గంగమ్మ, తాళ్లపాక పెద గంగమ్మ, అంకాళమ్మ, ముత్యాలమ్మ ఆలయాలకు అవిలాల నుంచి సారె అందింది. 'ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియచేయడం ఏమనగా...నేటి నుంచి తిరుపతి గంగ జాతర మొదలైందహో..!' అంటూ తిరుపతి గంగజాతరకు మంగళవారం రాత్రి కైకాలకులస్థులు చాటింపు వేశారు. గంగమ్మ జన్మస్థలమైన తిరుపతి రూరల్ మండలం అవిలాలలో జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం అవిలాల గ్రామ పెద్దలు పూజలు నిర్వహించి పుట్టింట సారెను తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈవో జయకుమార్‌కు అందించారు. అక్కడినుంచి ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి సారె తీసుకొచ్చారు. దీని వెంబడే స్థానిక కైకాల వారు నగర పొలిమేర్లలో చాటింపు వేశారు. జాతర పూర్తయ్యేంత వరకు నగరంలో నివశించేవారు బయటఊర్లకు వెళ్లి నిద్రించకూడదనేది చాటింపు అర్థమని పెద్దలు చెబుతుంటారు. చాటింపు రోజు చిరుజల్లులు పడడం ఆనవాయితీగా వస్తోందని, అందుకు తగ్గట్టే గంగమ్మ తల్లి కరుణించి చల్లబరిచిందని భక్తులు విశ్వసించారు.

● జాతర కమిటీలపై కుమ్ములాటలతో
నవ్వుతున్నారు నాయకా! 6





పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, మే6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలోని 'దశావతార-అష్ట లక్ష్మి' మండపంలో మంగళవారం సాయంత్రం పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజైన మంగళవారం మలయప్పస్వామి గజవాహనంపై కొలువుదీరి ఉభయనాంచారులతో కలిసి మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. వివిధ హంగులతో శోభిల్లుతున్న పెండ్లి మండపంలో నిత్య నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు, మాల పరివర్తనం, పూలబంతులాట, నూతన పట్టువస్త్రాల సమర్పణ కోలాహలంగా జరిగాయి. స్వామికి కొలువు నిర్వహించాక చతుర్వేద పారాయణం, మలహారి, దేశిక, సౌరాష్ట్ర, వారహి, కదన కుతూహల, నీలంబరి వంటి వివిధ రాగ-తాళ వాయిద్యాల నడుమ స్వామి వార్ల కల్యాణం జరిగింది. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించాక శ్రీదేవి, భూదేవి సహితుడైన స్వామి అశేష భక్త జనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యురాలు పనబాక లక్ష్మి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, పెండ్లి మండపాన్ని టన్ను పండ్లు, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో దాదాపు 150 మంది గార్డెన్ సిబ్బంది, 50 మంది ఎలక్ట్రిక్ సిబ్బంది అలంకరించారు.

పెలికాన్ పక్షికి వడదెబ్బ



సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద ఓ ఇంటి సమీపంలో పెలికాన్ పక్షికి వడ దెబ్బ తగిలి పడిపోయింది. నెర్రికాలువ వద్ద సేదతీరున్న పెలికాన్ పక్షికి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలింది. స్థానికులు గమనించి వన్య ప్రాణి అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు పెలికాన్ పక్షికి పశువైద్య శాలలో వైద్య పరీక్షలు చేయించి కుదిరి చెరువులో విడిచిపెట్టారు. పెలికాన్‌ను రక్షించిని సిబ్బందిని డీఎఫ్‌వో హారిక, ఎఫ్ఆర్‌వో నరసింహారావు అభినందిచారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సత్యవేడు కొలిక్కి వస్తుందా?

● టీడీపీ కోటలో వర్గాలతో బీటలు ● నారా లోకేశ్ కొలిక్కి తెస్తారని శ్రేణుల్లో ఆశలు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): యువనేత, మంత్రి నారా లోకేశ్ బుధవారం సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులతో సమావేశం అవుతుండడంతో ఇక్కడి రాజకీయాలపై జిల్లా అంతా ఆసక్తి నెలకొంది. టీడీపీకి తొలి నుంచీ బలమైన పట్టున్న నియోజకవర్గంలో వర్గవిభేదాలు తారస్థాయిలో ఉన్న సమయంలో లోకేశ్ ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ తొలగుతుందా? నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించబోతున్నారు? అనే అంశాలు చర్చగా మారిన నేపథ్యంలో లోకేశ్ అన్నీ చక్కదిద్దుతారనే ఆశాభావంతో ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి.

తొలినుంచీ నాయకత్వ సంక్షోభమే!

సత్యవేడు నియోజకవర్గం తొలి నుంచీ టీడీపీకి బాగా పట్టున్న ప్రాంతం. పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ పది సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు సార్లు టీడీపీ అభ్యర్థులు గెలిచారు. టీడీపీ నేతల నడుమ వర్గ విభేదాల కారణంగానే ఆ మూడు సార్లూ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నియోజకవర్గంలో తొలినుంచీ టీడీపీకి నాయకత్వ సమస్య ఎదురవుతూనే వుంది. తొలి ఎన్నికల్లో పోటీ చేసిన తలారి మనోహర్ మొదలుకుని తర్వాత వచ్చిన సురాజ్, నారమల్లి శివప్రసాద్, హేమలత, తలారి ఆదిత్యతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వరకూ ఎవరూ బలంగా నిలదొక్కుకోలేకపోయారు. ఐదేళ్లలోపే పార్టీ నుంచీ బలమైన వ్యతిరేకత ఎదుర్కొనడం, తదుపరి ఎన్నికల్లో టికెట్ కోల్పోవడం, నియోజకవర్గ ముఖచిత్రం నుంచీ తెరమరుగు కావడం జరుగుతోంది.



సత్యవేడులో లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఐదేళ్ల నుంచీ దారీ తెన్నూ లేని పార్టీగా..

గత ఐదేళ్లూ సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ మరీ దారుణ పరిస్థితులను ఎదుర్కొంది. 2014 ఎన్నికల్లో గెలిచిన తలారి ఆదిత్యకు 2019లో టికెట్ దక్కలేదు. 2019 ఎన్నికల్లో పార్టీ టికెట్‌పై పోటీ చేసిన జేడీ రాజశేఖర్ ఓడిపోయారు. ఆ తర్వాత ఆయనకు ఇంఛార్జి పదవి దక్కలేదు. కొంత కాలం ఇంఛార్జి లేకుండా గడిచాక మాజీ ఎమ్మెల్యే హేమలతకు ఆ బాధ్యతలు అప్పగించారు. నెలల వ్యవధిలోనే ఆమెను తప్పించి ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్‌కు ఇంఛార్జి ఇచ్చారు. దీంతో నియోజకవర్గంలో హేమలత (హెలెన్) వర్గం, జేడీ రాజశేఖర్ వర్గాలు ఏర్పడ్డాయి. తీరా 2024 ఎన్నికల్లో వీరిద్దరినీ పక్కన పెట్టి అధిష్ఠానం అధిష్టానం వైసీపీ నుంచీ వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి టికెట్ ఇచ్చింది. ఆయన గెలుపునకు హేమలత, రాజశేఖర్ వర్గాలు పనిచేయలేదు. రాజశేఖర్ ఇండిపెంటెండ్‌గా పోటీ చేశారు. హేమలత వర్గం మరో ఇండిపెండెంట్ రమేష్‌కు మద్దతిచ్చింది. అయితే కోనేటి ఆదిమూలం ఇంతటి ప్రతికూలతను కూడా అధిగమించి పార్టీ సానుకూల ప్రభంజనం వల్ల ఎమ్మెల్యేగా గెలిచారు.

సస్పెన్షన్‌లోనే ఆదిమూలం

గెలిచినా కోనేటి ఆదిమూలం రాజకీయంగా స్థిరంగా అయితే లేరు. టీడీపీ వారికి కాకుండా వైసీపీ నుంచీ తన వెంట వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అధిష్ఠానానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనికితోడు ఓ మహిళతో వివాదం కారణంగా క్రిమినల్ కేసులో చిక్కుకుని పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినడానికి కారకులయ్యారు. దీంతో పార్టీ నుంచీ ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆ కేసు న్యాయస్థానంలో రాజీ చేసుకున్నప్పటికీ పార్టీ సస్పెన్షన్ మాత్రం ఇంకా తొలగలేదు. దీంతో ఏడు నెలలకుపైగా నియోజకవర్గంలో పార్టీకి దారీ తెన్నూ లేకుండా పోయింది. నాయకులు, కార్యకర్తలూ పెద్దగా ఎమ్మెల్యే దగ్గరకు వెళ్ళడం లేదు. గత ఎన్నికల సమయంలో పరిశీలకుడిగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఓ వర్గ నేతగా ఎదిగారు. ఆయనకు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పదవి దక్కుతుందని అనుచరవర్గం ఆశిస్తోంది. మాజీ ఎమ్మెల్యే హేమలత అడపాదడపా వచ్చి వెళుతున్నారు. కొద్దోగొప్పో వర్గాన్ని కూడగట్టుకుని ఇంఛార్జి పదవిని ఆశిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి వంద రోజుల తర్వాత చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణకు కో ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబు కూడా ఒక వర్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. వీరిలో చంద్రశేఖర్ నాయుడు పక్షం రోజుల కిందట అభివృద్ధి పనులు ప్రారంభించడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎస్సీ నియోజకవర్గం అని అలుసుగా తీసుకుంటున్నారని, ఇతర నియోజకవర్గాల్లో ఇలా చేయగలరా అంటూ బహిరంగంగానే విమర్శలు చేశారు. ఇలా నేతలు వర్గాలుగా విడిపోవడంతో- నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం, పనుల కోసం ఎవరిని ఆశ్రయించాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. కాగా యువనేత నారా లోకేశ్ నేడు సత్యవేడుకు వచ్చి పార్టీ శ్రేణులతో సమావేశం కానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. ఎవరో ఒకరికి పార్టీ పగ్గాలు అప్పజెప్పి నియోజకవర్గంలో అభివృద్ధి జరిగేలా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నారు.



చిన్నారితో మొక్కులు





సారె తీసుకొస్తున్న కైకాల వంశీయులు - అమ్మవారి వేషంలో..



మంగళవారం రాత్రి అవిలాల నుంచి సారె ఊరేగింపు

నవ్వుతున్నారు..నాయకా!

జాతర ఉత్సవ కమిటీలపై కూటమిలో కుమ్ములాటలు

ఒకటి కాదు, రెండు కాదు నాలుగు జాబితాలు విడుదల

(తిరుపతి, ఆంధ్రజ్యోతి)

తిరుపతి కూటమి నేతల్లోని అనైక్యతకు తిరుపతి గంగజాతర అద్దం పడుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరవుతున్నా గంగమ్మ గుడికి పాలకమండలిని ప్రకటించలేకపోగా, జాతర నిర్వహణకు ఉద్దేశించిన ఉత్సవ కమిటీని కూడా ఏకాభిప్రాయంతో ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్నారు. మార్పులూ చేర్పులూ, అలకలూ కోపతాపాలతో జాతర చాటింపు మొదలైన మంగళవారం సాయంత్రానికి 23 మందితో కలెక్టర్ సంతకంతో ఒక జంబో కమిటీని ప్రకటించారు. మరోవైపు నాయకుల భేషజాలతో సంబంధం లేకుండా జాతర తంతు మాత్రం సంప్రదాయంగా మొదలైపోయింది. ప్రజలు భక్తితో సున్నపు బొట్లుతో, వేషాలతో, దుత్తలతో వచ్చి గంగమ్మను దర్శించుకుని వెళ్తున్నారు.

దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండలి లేకపోతే తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమించి ఉత్సవాలు నిర్వహిస్తారు. గత 20 ఏళ్ల తిరుపతి జాతరలో మూడుసార్లకు పైగా స్థానికాలయాలకు ఇలాగే ఉత్సవ కమిటీలను నియమించారు. ఈ సంప్రదాయం ప్రకారం తిరుపతి గంగమ్మజాతరకు ఉత్సవకమిటీని ఏర్పాటు చేశారు. ఇదే కూటమి నేతల మధ్య అభిప్రాయ భేదాలకు కారణమైంది. కూటమిలోని ఇతర పార్టీల నేతలతో సంప్రదింపుల తర్వాత జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 27 మందితో ఒక జాబితాను తొలుత సిద్ధం చేశారు. ఇందులో సింహభాగం టీడీపీ కార్యకర్తలే ఉన్నారు. దానిని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ద్వారా రాష్ట్ర కమిషనర్‌కు పంపారు. అదేఫైనల్ అనుకుని అందులో పేర్లున్నవారు ఆ జాబితాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకుని శుభాకాంక్షలు అందుకుని సంబరపడ్డారు. ఇంతలో ఏం జరిగిందో ఏమోగాని నాలుగు రోజుల కిందట కలెక్టరేట్ నుంచి డీఆర్వో నరసింహులు పేరుతో 15 మందితో మరో జాబితా విడుదలైంది. ఇందులో తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలతో పాటు వివిధ నామినేటెడ్ పదవులు పొందిన కూటమి నేతలు, మాజీ ఛైర్మన్లు ఉన్నారు. దీనిపై కూటమి పార్టీల కార్యకర్తలు తీవ్రంగా అసంతృప్తి చెందారు. సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నాయకులపైనే ఆగ్రహం వెళ్లగక్కారు. గంగమ్మ గుడిలో పదినిమిషాలు కూడా కూర్చోని వారిని ఉత్సవ కమిటీలో ఎలావేస్తారని ప్రశ్నించారు. ఇదిలావుంటే ఈ జాబితాలతో సంబంధంలేకుండా డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నందగోపాల్ నాయుడుల పేరుతో డీఆర్వో మరో ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

జాతర తుదికమిటీ సభ్యులు వీరే

గంగజాతర తుది కమిటీలో బాలసుబ్రమణ్యం రెడ్డి, మన్నెం శ్రీనివాసులు, ఆముదాల తులసీరాం,మహేష్ యాదవ్, ఆనంద యాదవ్, ఉమాశంకర్, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి, శాంతి కుమారి, అశోక్, దేవరాజులు, నందగోపాల్ నాయుడు, విజయలక్ష్మి, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తమ్మినేని వెంకటేశ్వర్లు, హరిశంకర్, బాబ్జి, సుధాకర్, బుజ్జిబాబు, ఆనంద్, తమ్మిశెట్టి చంద్రశేఖర్, ఎన్వీ నరసింహ యాదవ్, ప్రభాకర్, సోము వేదవతి రాయల్ ఉన్నారు.

కలెక్టర్ సమీక్షతోనూ కొలిక్కిరాలేదు

అసంతృప్తులు, విమర్శల నేపథ్యంలో వివాదానికి తెరవేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ భావించారు. కూటమి ముఖ్యులను కూర్చోబెట్టుకుని సోమవారం కలెక్టరేట్‌లో జాతరపై సమీక్షిస్తూ తుదిజాబితాకోసం పని చేసేవారి పేర్లు ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. అడిగిందే తడవుగా ఎవరికివారు పెద్ద సంఖ్యలోనే పేర్లు ఇచ్చినట్టు తెలిసింది. ఈ సమయంలో ఇద్దరు నేతలు అలిగి వెళ్లిపోయారని సమాచారం. జాతర కమిటీ జాబితా మళ్లీ మొదటికి రావడంతో.. టీటీడీ బోర్డులోనూ ఇంత మంది ఉండరు కదా.. మీరే తేల్చుకుని జాబితా ఇవ్వండని కలెక్టర్ అన్నట్టు తెలిసింది. కమిటీ కోసం జాతర ఆగదు కదా. మంగళవారం మొదలైపోయింది. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు 21 మంది పేర్లతో కలెక్టర్ పేరిట ఓ జాబితా విడుదలైంది. దానికి కూడా సంతృప్తి చెందని కూటమి నేతలు కలెక్టర్‌పై ఒత్తిడి చేసి మరో ఇద్దరి పేర్లను తగిలించుకున్నారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో 23 మందితో కలెక్టర్ సంతకంతో మరో జాబితా వెలువడింది. ఏడాదికోసారి జరిగే జాతరనే కలిసి నిర్వహించుకోలేని స్థితిలో కూటమి నేతలు ఉంటే భవిష్యత్తు ఎలా ఉండబోతుందా అనే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

జిల్లాలో పలుచోట్ల అకాల వర్షాలు

● కూలిన వృక్షాలు ● విద్యుత్తు తీగలు తెగి సరఫరాకు అంతరాయం



వెంకటగిరి పట్టణం రాణీపేట వద్ద ఓ దుకాణంపై తిరగబడిన రేకులు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం అకాల వర్షాలు కురిశాయి. 4 గంటల వరకూ ఎండలు, ఉక్కపోతతో జనం సతమతమవగా.. ఆ తర్వాత వాతావరణంలో మార్పు కనిపించింది. వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు, పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, తిరుపతి రూరల్, డక్కిలి, బాలాయపల్లి తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏర్పేడు మండలంలో గోడకూలి ఇద్దరు మృతిచెందారు. వెంకటగిరి అరగంట పాటు గాలీవానా బీభత్సం సృష్టించింది. వృక్షాలు కూలాయి. దుకాణాలపై రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీకాళహస్తిలో 6.20 నుంచీ 40 నిమిషాల పాటు హోరుగాలులతో పాటు పడిన వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పుత్తూరు పోలీస్ స్టేషన్, గేటు పుత్తూరు, నారాయణవనం రైల్వే గేటు తదితర చోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. కేవీఎం అగ్రహారం వద్ద విద్యుత్ స్తంభంపై రెండు చెట్లు కూలడంతో ఆయా ప్రాంతాల్లో సరఫరా ఆగిపోయింది. తిరుపతి రూరల్ మండలంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గొల్లపల్లిలో సర్పంచ్ రవి కారుపై వేపచెట్టు కూలింది. తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో సైతం గాలులతో కూడిన వర్షం కురిసింది.

వేషాల జాతర షురూ

● నేడు బైరాగి వేషం

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జాతరకు చాటింపు వేశారని తెలియగానే నగరంలోని యువతతో పాటు చిన్నపిల్లల్లో ఆనందం ఉరకలేస్తుంది. వారం రోజులపాటు వివిధ వేషాలతో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. బుధవారం బైరాగి వేషంతో వేషాల జాతర మొదలవుతుంది. శరీరమంతా నామం కొమ్ము లేదా విభూతి పూసుకుంటారు. రేళ్ల కాయల మాలలు మెడలో ధరించి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. వేషంతో ఇంటి దగ్గర బయల్దేరినప్పటి నుంచి బూతులతో జనాలను భయపెట్టడం జాతర ఆచారం. ఇవిగాక పలువురు మహిళలు వేపాకు చీరలు కట్టుకుని, నెత్తిన వేయికళ్ల దుత్తలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.



గంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

రెండు చోట్ల గోడకూలి ఇద్దరి మృతి

● ఒకరికి గాయాలు



ఎల్లప్పరెడ్డి (పాతచిత్రం)





గోడకూలడంతో మృతిచెందిన సోమిశెట్టి ఆంజనేయులు

ఏర్పేడు, మే 6(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో మంగళవారం సాయంత్రం గాలివానకు గోడ కూలి ఇద్దరు మృతిచెందారు. చిందేపల్లి దళితవాడలో క్రికెట్ ఆడుతున్న పెద్దలు, పిల్లలు వర్షానికి తల దాచుకోవడానికి మైదానం సమీపంలోని రేకుల షెడ్‌లోకి వెళ్లారు. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో గోడ కూలగా, సోమిశెట్టి ఆంజనేయులు(19) అక్కడికక్కడే మృతి చెందగా కోటేశ్వరరావు(27) గాయపడ్డాడు. ఈయన్ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అలాగే, వికృతమాలకు చెందిన ఎల్లప్పరెడ్డి(60) పొలం నుంచి వస్తుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో కోళ్ల ఫారం వద్దకు వెళ్లారు. అక్కడ గోడ కూలి ఎల్లప్పరెడ్డిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్ఎస్ ఏపీసీగా గౌరీశంకర్‌రావు



తిరుపతి(విద్య), మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష విభాగం అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ జి.గౌరీశంకర్‌రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై పాఠశాల విద్యాశాఖకు బదిలీచేస్తూ ఎస్ఎస్ ఏపీసీగా నియమించారు. ఈ మేరకు మంగళవారం సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు డీఈవో కేవీఎన్ కుమార్ ఇన్‌చార్జిగా నిర్వహిస్తున్నారు. కాగా, శంకర్‌రావు గతంలో వరదయ్యపాళెం ఎమ్మార్వోగా పనిచేశారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు 611 మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాతపరీక్షలకు 611మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. కాగా జిల్లాలో మంగళవారం ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలకు మొత్తం 911మంది అభ్యర్థులకు గాను 611మంది హాజరయ్యారని, 300మంది గైర్హాజరయ్యారని వివరించారు.

కేరళ తరహాలో పర్యాటకాభివృద్ధి

● జిల్లాలో మెండుగా అవకాశాలు

ఉన్నాయన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి, జోనల్ ఇన్‌ఛార్జి కృష్ణబాబు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేరళ తరహాలో మెడికల్, హోటల్, స్పిరిచ్యువల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రాష్ట్రంలో స్థూల జాతీయోత్పత్తిలో జిల్లా 3వ స్థానంలో ఉందని, మొదటి స్థానంలోకి వచ్చేలా అన్ని శాఖల అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో పెట్టుబడులకున్న అవకాశాల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించాలన్నారు. పరిశ్రమలకు అనుగుణంగా అధునాతన నైపుణ్య శిక్షణ మ్యాన్‌పవర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటసాగులో అధునాతన పద్ధతులను పాటించేలా రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

పంటపొలాలపై ఏనుగుల దాడి

పాకాల, మే 6 (ఆంధ్రజ్యోతి): పదిపుట్లబైలు పంచాయతీ గుండ్లగుట్టపల్లె సమీపంలోని పంటపొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. పంటలను ధ్వంసం చేశాయి. రైతు డి.సరోజమ్మకు చెందిన టమోట పంటను తొక్కివేసి తీవ్ర నష్టం కలిగించాయి. మండల ఉద్యాన అధికారి శైలజ నష్టపోయిన పంటలను పరిశీలించారు.



ఏనుగులు ధ్వంసం చేసిన టమోట పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

చదువుతోనే ఉజ్వల భవిత



విద్యార్థిని అభినందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు, మట్టం శ్రావణి

గూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తిరుపతి పార్లమెంటు టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభచాటిన చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులు పదో తరగతిలో మంచి ఫలితాలను సాధించడం అభినందనీయమన్నారు. లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి వాటిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సురేష్, మల్లి, సాయి, మౌలా తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన పెంచాలి

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బీమా పథకాలపై అవగాహన పెంచాలని ఏపీడీ వరప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 'ఉపాధి కూలీలు - బీమా పథకాలు' అనే అంశంపై క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న సమయంలో కూలీలకు గుండెపోటు, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పనులు చేస్తూ పూర్తిగా, పాక్షికంగా అంగవైకల్యం పొందిన వారికి వర్తించే కార్మికశాఖ ఆధ్వర్యంలో కొత్తగా వచ్చిన పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్‌లు కాటయ్య, కరుణాకర్‌రెడ్డి, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన

చిల్లకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధి కార్యాలయంలో మంగళవారం అసిస్టెంట్ లేబర్ అధికారి సత్యనారాయణ, ఏపీడీ వరప్రసాద్ కార్మికులకు వర్తించే బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ-శ్రమ్, భవన నిర్మాణ కార్మికుల బీమా, ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి వంటి పథకాల ద్వారా ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

గూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో మంగళవారం వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ భూములను ధనిక ముస్లింలకు అప్పగిస్తూ పేద ముస్లింలను అణిచివేతకు గురిచేసిందన్నారు. ప్రధాని మోదీ ఈ చట్టాన్ని సవరించి వక్ఫ్ భూములు పేద ముస్లింలకు చెందేలా నూతన చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. వక్ఫ్ చట్టంపై ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పహల్గాం ఉగ్రవాద దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు సంతాపం తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కోలా ఆనంద్, చంద్రప్ప, వరప్రసాద్, తాజుద్దీన్, మస్తాన్, కిరణ్‌రెడ్డి, దయాకర్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, బిందురెడ్డి, నరేంద్ర, భైరప్ప, ప్రకాష్‌నాయుడు, దినకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల మంజూరుకు చర్యలు

గూడూరు అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ ప్రాంతంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యుడు ఏసుపాక పెంచలయ్య అన్నారు. మంగళవారం స్థానిక గాంధీనగర్‌లో హౌసింగ్ అధికారులతో కలిసి లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో గాంధీనగర్‌లో ఎన్టీఆర్ గృహాలను నిర్మించడం జరిగిందన్నారు. ఇవి శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారని, వీటి స్థానంలో పీఎంఏవై పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరడం జరిగిందన్నారు. హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల వివరాలు సేకరించడం జరిగిందని, త్వరలోనే కాలనీ ఇళ్లు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ షబ్బీర్, సురేంద్ర, శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుడికి నగదు, నిత్యావసరాలు అందజేత



బాధితుడికి నగదు అందజేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

చిల్లకూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలు గ్రామంలో పూరిల్లు కాలిపోయిన నిర్వాసితుడైన నాగభూషణంకు మంగళవారం ఉపసర్పంచు వినయ్‌కుమార్ సహకారంతో నిత్యావసరాలు దుప్పట్లు, రూ.5వేలు నగదును తహసీల్దారు శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లి పక్కా గృహం మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంటల్లో కాలిపోయిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తక్షణమే మంజూరు చేస్తామన్నారు. ఉపసర్పంచు వినయ్‌కుమార్ మాట్లాడుతూ బాధితుడు నాగభూషణంకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో గిరీష్‌చంద్ర, రామచంద్రారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహం, ధర్మయ్య, దేశయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి



తడ, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలిశారు. మంగళవారం అమరావతి సచివాలయంలో మంత్రిని కలిసిన ఆమె నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి కార్యక్రమాలకు మరిన్ని నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు రఫీ, కిషోర్ ఉన్నారు.

ఎంఈవో కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలు

తడ, మే 6(ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు మంగళవారం ఎంఈవో కార్యాలయానికి చేరాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనేపథ్యంలో విద్యా కిట్లు, పాఠ్యపుస్తకాలను ఆయా మండలాలకు తరలించింది. వాటిని భద్రపరిచి పాఠశాలల ప్రారంభం రోజున విద్యార్థులకు అందజేస్తామని ఎంఈవో మల్లికార్జునరావు తెలిపారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

యానాదుల గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేషవర్ధన్ కోరారు. ఎంపీసీలో 40, బైపీసీలో 40, హెచ్‌ఈసీలో 40, ఏఅండ్‌పీలో 20 సీట్లు ఉన్నాయన్నారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన యానాదుల విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులకు విడిగా ప్రతి గ్రూపులోనూ 5శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం లక్ష రూపాయల లోపు ఉండాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9441033367 నెంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

రెండోరోజు విజిలెన్స్ తనిఖీలు

సూళ్లూరుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో మంగళవారం రెండోరోజు కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. నెల్లూరు ఆర్టీసీ ట్రాఫిక్ విభాగానికి చెందిన విజిలెన్స్ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది డిపోలోని పరిపాలన విభాగాల్లో రికార్డులు తనిఖీ చేశారు. బస్సుల కేఎంపీఎల్, సిబ్బంది పనితీరు, సర్వీసుల వివరాల గురించి ఆరా తీశారు. అనంతరం ట్రాఫిక్ విభాగంలో పనిచేసే అధికారుల నుంచి కొన్ని వివరాలు సేకరించినట్లు సమాచారం.



శిథిలావస్థకు చేరిన తహసీల్దారు కార్యాలయం - గోడలు, అడుగు దెబ్బతిన్న కార్యాలయ వరండా - బీటలువారిన గోడలు

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- వర్షం వస్తే ఉరుస్తున్న పైకప్పు
- పెచ్చులూడి పడుతుండడంతో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధుల నిర్వహణ
- తహసీల్దారు కార్యాలయంలో విషసర్పాల బెడద

పెళ్లకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరులోని తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా తహసీల్దారు కార్యాలయం పాడుబడిపోయి భవనానికి పగుళ్లు ఏర్పడ్డాయి. తేలిక పాటి వర్షానికే పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఉద్యోగులు, సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో విష సర్పాల బెడద అధికంగా ఉంది. అర్జీదారులు ఉండే మెట్లక్రింద ప్రాంతంలో గతంలో నాలుగు సార్లు నాగుపాములను గుర్తించారు. పాములు పట్టేవారిని పిలిపించి పట్టించారు. తరచూ పాములు సంచరిస్తుండడంతో రెవెన్యూ సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలు హడలిపోతున్నారు. తహసీల్దారు కూర్చునే గది పూర్తిగా బీటలు వారి శిథిలావస్థకు చేరడంతో పక్కనే ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలో గదిని ఆయన ఛాంబర్‌గా ఉపయోగిస్తున్నారు. మిగిలిన గదులు కూడా ఉరుస్తూ పెచ్చులూడి పడుతుండడంతో అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ భవనం దెబ్బతిని పెచ్చులూడుతోంది. అదే విధంగా పొదలు, ముళ్ల కంపల మధ్యలో నాణ్యత లేకుండా నిర్మించిన పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పోలీసులు క్వార్టర్స్‌లో ఉండేందుకు ఆసక్తి చూపడంలేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాంచాల్సిన అవసరం ఉంది.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ - అమ్మవారిని కొలువుదీర్చేందుకు ఏర్పాటు చేసిన పీఠం వద్ద పూజలు - ఆలయం వద్ద చలువ పందిళ్లు

నేడు పోలేరమ్మ జాతర

నాయుడుపేట/టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర వేడుకగా సాగుతోంది. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన పోలేరమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఉదయం ఘటంతో ప్రారంభమయ్యాయి. ఘటం, దున్నపోతుకు గ్రామంలో ఇంటింటా హారతులు ఇస్తూ పూజలు చేసి మడిబియ్యం సమర్పించుకుంటున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి పీఠాన్ని నిర్మింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారి నిలుపు, బుధవారం జాతర నిర్వహించనున్నారు. సంప్రదాయం ప్రకారం అమ్మవారి పుట్టినిల్లు అయిన పడమటి వీధి బోయపాళెంలోని కుమ్మరిమిట్టలో పోలేరమ్మ విగ్రహాన్ని తయారు చేస్తారు. మంగళవారం రాత్రి అత్తవారి ఇల్లు అయిన శెట్టిపల్లివారి వీధిలోని అలంకరణ గుడికి తీసుకువస్తారు. అక్కడ అమ్మవారి విగ్రహానికి కళ్లు అమర్చి పూజలు నిర్వహిస్తారు. బుధవారం వేకువజామున సప్పరంపై పోలేరమ్మ కొలువుతీరిన వెంటనే బజారు వీధికి దక్షిణం వైపు ఉన్న గ్రామస్తులంతా అమ్మవారికి కుంభాలు పోసి కోళ్లు, పొటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బజారు వీధి నుంచి బ్రాహ్మణ వీధి మీదుగా గడియారం సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. దారి పొడవునా భక్తులు పూర్ణకుంభాలు పోసి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామోత్సవం అనంతరం పోలేరమ్మ విగ్రహాన్ని గడియారం సెంటర్ వద్ద చావిడి ఎదుట చలువ పందిరిలో ప్రతిష్ఠిస్తారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం గ్రామ సరిహద్దుల్లో పొలికూడ చల్లి విన్నమాల గ్రామస్తులు బలి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం అత్తవారిల్లుగా పిలుచుకునే పాత పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో అమ్మవారు విడిది చేస్తారు. తరువాత బేరిపేట నుంచి సప్పరం తరలిరాగా పోలేరమ్మ గ్రామోత్సవానికి వెళుతుంది. దర్గా రోడ్డు సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం నిమజ్జనం కోసం రాజగోపాలపురానికి తరలడంతో పోలేరమ్మ జాతర ముగుస్తుంది.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు మైక్రో టవర్ కాలనీ సమీపంలో మంగళవారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతిచెందింది. కొండుగుంట, చీమలతిప్ప అటవీ ప్రాంతం నుంచి దాహార్తి తీర్చుకునేందుకు చిట్టేడువైపు చుక్కలదుప్పి పరుగులు తీసింది. కుక్కలు వెంబడించి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన దుప్పి మృతిచెందింది. అటవీశాఖ సెక్షన్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

టీడీపీ నేతకు నివాళి



నారాయణ మృతదేహంపై టీడీపీ జెండా కప్పి నివాళులర్పిస్తున్న గణపర్తి కిషోర్ నాయుడు తదితరులు

చిట్టమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరుకు చెందిన టీడీపీ యువ నాయకుడు, జీఎం నాయుడు ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చెర్మన్ బద్దిగ నారాయణకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈనెల 2న అమరావతి పునఃప్రారంభ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరయ్యేం దుకు విజయవాడకు వెళ్లిన నారాయణ బ్రెయిన్ స్ట్రోక్‌తో కోమాలోకి వెళ్లాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం నారాయణ మృతదేహానికి టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అలాగే సునీల్‌రెడ్డి, జనార్దనరెడ్డి, బాబు నాయుడు, గోపాల్ నాయుడు, కస్తూరయ్య, రాజేష్‌రెడ్డి, రషీద్ తదితరులు నివాళులర్పించారు.

కోటకు చేరిన జ్యోతి యాత్ర

కోట, మే 6(ఆంధ్రజ్యోతి): చెన్నై శివారులోని కన్యకా పరమేశ్వరీ ఆలయం నుంచి నెల్లూరు జిల్లా పెనుగొండలోని కన్యకా పరమేశ్వరి వరకు చేపట్టిన జ్యోతియాత్ర మంగళవారం కోట పట్టణానికి చేరుకుంది. ఆర్యవైశ్య నాయకులు మేళతాళాలతో స్వాగతం పలికి స్థానిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జ్యోతిని ప్రతిష్ఠించారు.

తాటిచెట్టుపై పిడుగు

సూళ్లూరుపేట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెముత్తేరిలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొత్త హరిజనవాడకు సమీపంలో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడింది. మంటలు చెలరేగి తాటిచెట్టు దగ్ధమైంది. భారీ శబ్ధంతో పిడుగు పడడం, వెంటనే మంటలు చెలరేగడంతో సమీపంలోని ఇళ్లలో ఉన్న వారు భయాందోళనకు గురై పరుగులు తీశారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

వెంకటగిరి టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోమసానిగుంట, వల్లివేడు ప్రాంతాల్లో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాలను గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. షెడ్డు ప్రాంగణంలో మొక్కలు నాటి మట్టితో చదును చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ రవి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గిరిజనుడికీ ఆధార్ ఉండాలి

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి గిరిజనుడూ తప్పనిసరిగా ఆధార్ కార్డును కలిగి ఉండాలని జిల్లా ట్రైబర్ వెల్ఫేర్ అధికారి జాన్, హుజూర్‌బాషా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గిరిజనులకు ఆధార్ అనుసంధానంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఆధార్ ప్రాముఖ్యాన్ని గిరిజనులకు వివరించాలని, ఇందుకోసం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు.

పోలేరమ్మకు గొల్లసారె



గొల్లసారెను ఊరేగింపుగా తీసుకెళుతున్న యాదవ సంఘ నేతలు

నాయుడుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత పోలేరమ్మ జాతరను పురస్కరించుకుని యాదవ సంఘ నాయకులు అమ్మవారికి గొల్లసారెను సమర్పించారు. రాజగోపాలపురంలోని యాదవ సంఘ నాయకులు జనార్దన్ యాదవ్ నివాసం వద్ద నుంచి మంగళవారం సాయంత్రం వీరతాళ్ల నృత్యాలు, వాయిద్యాల నడుమ గొల్లసారెను పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి పోలేరమ్మకు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

జాతరకు భారీ బందోబస్తు

నాయుడుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత పోలేరమ్మను భారీ బందోబస్తు నడుమ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసిన డీఎస్పీ పలు సూచనలు ఇచ్చారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నలుగురు సీఐలు, 15మంది ఎస్ఐలు, 281మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చెన్నై - గూడూరు మధ్య మరో రెండు రైల్వే లైన్లు

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మధ్య మరో మరో రెండు రైల్వే లైన్లు ఏర్పాటుకు అనుమతించాలని దక్షిణ రైల్వే సిఫారసు చేసింది. ఈ విషయమై రైల్వే అధికారులు మాట్లాడుతూ... చెన్నై - గుమ్మిడిపూండి - గూడూరు మధ్య రెండు రైలు మార్గాలు ఉన్నాయన్నారు. చెన్నై సెంట్రల్ - అత్తిపట్టు వరకు 22 కిలోమీటర్ల దూరం నాలుగు రైలు మార్గాలు ఉన్నాయన్నారు. ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్లు ఆలస్యం లేకుండా నడిపేందుకు ఈ మార్గాలు సరిపోవడం లేదన్నారు. అందువల్ల చెన్నై - గూడూరు మధ్య 3, 4వ లైన్ల ఏర్పాటుకు అనుమతించాలని రైల్వే బోర్డుకు సిఫారసు చేశామని తెలిపారు. అదనపు రైలు మార్గాలు నిర్మిస్తే, ఢిల్లీ, ఆగ్రా, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఆలస్యం లేకుండా ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్లు నడిపే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

తిన్నెలపూడిలో ఏటీఎం మోడల్ సాగు

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడి గ్రామంలో ఏటీఎం మోడల్ సాగుకు రైతులు మంగళవారం శ్రీకారం చుట్టారు. చికుడు, బెండ, ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్ తదితర 12 రకాల విత్తనాలు నాటారు. ఈ విధానంలో నెలకు రూ.20 వేల నుంచి రూ.25వేల వరకు రైతులకు ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు చెప్పారు. ఇది పూర్తిగా సేంద్రియ ఎరువులతో, పురుగు మందులు లేని వ్యవసాయ విధానమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు శ్రీనివాసులు, పద్మ, శివ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు నాటుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

వెంకటగిరిలో గాలివాన బీభత్సం



దక్షిణపు వీధిలో నేల కూలిన చెట్టు

వెంకటగిరి టౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో గాలివానతో బీభత్సం సృష్టించింది. మంగళవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపించినప్పటికీ మధ్యాహ్నం తరువాత నల్లటి మబ్బులు కమ్మేశాయి. సాయంత్ర 5గంటల నుంచి ఈదురు గాలులు బలంగా వీచాయి. 5.30నుంచి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని దక్షిణపు వీధిలో ఓ భారీ వృక్షం, తహసీల్దార్ కార్యాలయం వద్ద వృక్షం నేల కూలాయి. రాణీపేట వద్ద ఉన్న ఆరు దుకాణాలపై రేకులు ఎగిరిపోయాయి. అలాగే పలుచోట్ల ఫ్లెక్సీలు, బ్యానర్లు కూలిపోయాయి. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పోలేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



పోలేరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ, రామకృష్ణ

నాయుడుపేట టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మను ఎమ్మెల్యేలు డాక్టర్ నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి జాతర కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, దేవదాయశాఖ ఈవో రవికృష్ణ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, మధుసూదన్‌రెడ్డి, చెంగాళమ్మ ఆలయ మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, నెలవల రాజేష్, దార్ల రాజేంద్ర, గంగాప్రసాద్, జీవీఆర్ నాయుడు, మస్తాన్, పొట్లపూడి రాజేష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ధనుంజయ, అన్నమనేని సాయి, నారాయణ, రవి, శ్రీనివాసులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటు మృతుల కుటుంబాలకు పరిహారం

నాయుడుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట, ఓజిలి మండలాల్లో పిడుగు పాటుకు మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ అందజేశారు. నాయుడుపేట మండలం వద్దిగుంటకండ్రిగకు చెందిన భాస్కర్, ఓజిలి మండలం గొల్లపాళెం గ్రామానికి చెందిన కార్తీ పిడుగుపడడంతో ఆదివారం మృతి చెందారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.4 లక్షల చొప్పున పరిహారం మంజూరైంది. మంగళవారం రాత్రి నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్న కార్తీక్ తండ్రి ప్రదీప్‌కు, వద్దిగుంటకండ్రిగలోని భాస్కర్ సతీమణి మునీలాకు చెక్కులను ఎమ్మెల్యే విజయశ్రీ అందజేశారు. ఈ కార్యక్రమాల్లో నాయుడుపేట, ఓజిలి తహసీల్దార్లు రాజేంద్ర, పద్మావతి, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, టీడీపీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

20, 21, 22 తేదీల్లో పారిశుధ్య కార్మికుల సమ్మె



కమిషనర్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నేతలు

గూడూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా, 21, 22 తేదీల్లో గూడూరులో సమ్మె నిర్వహించనున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్స్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో రమేష్, కోటేశ్వరరావు, వెంకటరమణ, మురళి, అంకయ్య, ప్రసాద్, శివకుమార్, బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

కోట, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు వద్ద మంగళవారం బస్సు, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో స్కూటరిస్ట్ వెంకటకృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన ముత్తుకూరు బస్సు కోటకు వెళ్తుండగా కొక్కుపాడు మలుపువద్ద వెంకటకృష్ణారెడ్డి వెళ్తున్న మోటర్ బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటకృష్ణారెడ్డి కాలు విరిగింది. స్థానికులు ఆయనను కోట ఆస్పత్రికి తరలించారు.